నవశక్తి

Vol. 1, no. 14

(Mar. 16, 1938)

రాజమండ్రి, 1938

Record no. 682

Navaśakti

Vol. 1, no. 14

(Mar. 16, 1938)

Rājamaṇḍri, 1938

Record no. 682

NAVASAKTI అణా Telugu Weekly

నవశక్తి

కార్మికకర్షకులారా! ఏకముగండు!!

సాలు చందా ౩-౦-౦ ప్రచురణ: ప్రతిబుధవారం సంపాదకుడు: మద్దూరి అన్నపూర్ణయ్య

సంపుటం ౧ 16—3—38 రాజమండ్రి సంచిక ౧౪

★

★  ★

ప్రజా ప్రభుత్వానికై పోరాడు స్పానిష్ యువతీ యువకులు

ఆంధ్రరాష్ట్ర రైతుయాత్రాదళము

నెల్లూరు జిల్లాలోని కొవ్వూరు తాలూకా

నాపఖ్యటనానుభవములు:—

రైతు దళమువారు కావలి తాలూకా సంచారము పూర్తియైన పిదప తే 4/3/38 వుదయం కొవ్వూరు తాలూకాలోని అల్లూరు అను గ్రామమును చేరిరి. అల్లూరు స్థానిక రైతుసంఘమువారు ఒక సన్మాన పత్రమును సమర్పించిరి. సాయంకాలం షుమారు 4 గంటలకు అల్లూరులో సభజరిపిరి. దళాధిపతియగు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు, వి. వి. శివయ్యగారును రాజకీయములను రైతుసంఘములను వాని యావశ్యకతలను, కర్షక కార్మిక సంయోగములను గురించి విపులముగ నుపన్యసించిన పిదప జయజయ ధ్వానములతో సభ ముగిసెను. తర్వాత దళము వారు ఇందుపూరు చేరి, అచ్చట రాత్రి 8 ఘంటలకు సభ జరిపిరి. 5-3-38 వుదయం దళము తలమంచిని చేరెను. తలమంచిలోని ప్రజలు దళమువారికి తమ సంపూర్ణ సానుభూతిని తెలిపిరి. అచ్చట బస్వాయపాలెం వారును, వెంకనపురం ఆది ఆంధ్రులును మున్నగువారు ఆది ఆంధ్రులును మహాజరుల సమర్పించుకొనిరి. బస్వాయపాలెం డెల్టా గ్రామమైనప్పటికీయు నీటిపారుదల వసతులేదట. వారి నామాసా ప్రకారం నీరు ఇచ్చుట లేదు, అందువలన వారు పైరును గొట్టుతో వేసుకొనుచున్నారు. గవర్నమెంటువారి విషయమును తక్షణమే విచారించి వారికి తగిన సదుపాయములు కల్గించవలసినదిగా కోరుచున్నాము. వెంకనపురంలో ఆదిఆంధ్రుల నివాసస్థానము మాగాణిలో వున్నందువల్ల వర్షాకాలము పశువులకు, మనుజులకు రాకపోకలకు చాలయిబ్బంది కలుగుచున్నది. ఆపూరికి డొంకదారి వారికొనిలేదు! కావున కాంగ్రెస్ మంత్రివర్గము వారు వెంటనే వారికి ఒకరహదారి ఏర్పరచవలసినది కోరుచున్నాము.

తలమంచిలోని పురజనుల కోరికపై దళము పద్మనాభ సత్రముమీదుగా సాయంత్రం షుమారు 5 గంటలకు గండవరం చేరెను. అచ్చటినుండి బయలుదేరి, యల్లమ్మపాలెం, బుచ్చిరెడ్డిపాలెం, దామరమడుగు, గంగవరం మీదుగా కొవ్వూరు గ్రామములలో సంచారము గావించి 8/3/38 నెల్లూరు చేరిరి. ప్రతిగ్రామమునందును సభలు గావించబడెను. ప్రజలు చాలావుత్సాహమును కనుబరచిరి. మహాజర్లు సమర్పించుకొనిరి. పరిసర గ్రామములనుంచి కూడా మహాజర్లు పంపుకొనిరి.

చెల్లాయపాలెం గ్రామ శ్రోత్రియ గ్రామము, ఆ రైతులు ఖరీదుకు కొనిన భూములకు గూడా శ్రోత్రియందారు సరియైన పట్టాలు యివ్వక గ్రామస్థులను యిబ్బంది పెట్టుచున్నాడు, మరమ్మతు చేసుకొనిన భూములకు గూడా యివ్వుటలేదట. ప్రీమియములు ఎక్కువ యివ్వవలయునని అడుగుచున్నాడట. యివ్వనివారి భూములను రైతులనుండి తొలగించుచున్నాడట. కావున వెంటనే కాంగ్రెస్ మంత్రులు యీ విషయమును విచారించి అన్యాయముల నాపు చేయవలసినదిగ కోరుచున్నాము, లేనిచో కాంగ్రెస్ ప్రతిష్టకు భంగము కలుగునని హెచ్చరించుచున్నాము.

గంగవరం శ్రోత్రియ గ్రామము. ఆ గ్రామ రైతులు పూర్వము 30 సంవత్సరముల క్రిందట ఎకరము 1కి సిస్తు 8-0-0 చెల్లించుచుండిరట. శ్రోత్రియందారులు యినాముల బిల్లురాక పూర్వము భూమిని ఒక రైతునుండి యింకొకరికి మార్చుచుండిరట. యీవిధముగ మార్చుటచే రైతులలో అంతఃకలహములు పెరగినవి అందుచే అంతఃకలహము లనవసరముగా చూచుకొని శ్రోత్రియందారులు ఎకరము 1కి 30 రూపాయల వరకు మక్తా వసూలు చేయుచున్నారట. కావున బీదలగు గ్రామరైతులు తినతిండి లేక మాడుచున్నారు. పంటలు పోయినను మక్తా మాత్రము వసూలు చేయుచున్నారు. యియ్యెడ న్యాయమును విచారించి రైతులను వారి దురవస్థలనుండి తొలగించవలసినదిగ ప్రభుత్వము వారిని కోరుచున్నాము.

నెల్లూరు జిల్లాయందంతటను (యిప్పటివరకు మేము సంచరించినంతవరకు) పిచ్చుముంతల (తక్కువ కొలపాత్రల) వాడుక ఎక్కువగావున్నది. ప్రతిగ్రామందలి కూలీలు యీవిషయమునే ముఖ్యముగా తెలుపుచున్నారు. రైతుల కాధారభూతులగు కూలీలకు యీవిధముగా తక్కువ ముంతలతో ధాన్యము యిచ్చుచుండిరని ఆ కూలీల దురవస్థ వేరుగ చెప్పనవసరము లేదు. కూలీలందరిలోను అసంతృప్తి పెరుగుచున్నది. రైతులకు తక్కువ ముంతల వాడుట శ్రేయస్కరముగాదు. పైగా కర్షక కార్మిక సామరస్యమునకు విరుద్ధమగుచున్నది. కావున రైతులందరును యికనైనను తిను పిచ్చికొల పాత్రవు మాని మంచి పాత్రల నుపయోగించవలసినదిగను అట్లుపయోగించనున్న కర్షక కార్మిక సామరస్యమునకు తావుండదనియు హెచ్చరించుచున్నాము. ప్రభుత్వమువారు గూడా తగు శిక్షల విధించి తక్కువ కొలపాత్రల నిర్మూలను గావించెదరని యాశించుచున్నాము.

గ్రామాదుల యందలి కాంగ్రెస్ రైతుసంఘముల వారు తగు శ్రద్ధతీసుకొని యీదారుణ పద్ధతిని మానకున్నవారి కనీసధర్మముల నిర్వర్తించక పోయినవారగుటయే గాక గ్రామాదులలో క్షుద్బాధకు గురియై విద్యావిహీనులై దీనసత్తై జీవచ్ఛవములవలె జీవించు అసంఖ్యాక వ్యవసాయ కూలీలలో కాంగ్రెస్ పట్ల రైతు సంఘాల పట్లను అవిశ్వాసమును పెంపొందించుటకు తోడ్పడిన వారయ్యెదరని గమనింప కోరుచున్నాము.

కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి.
దళాధిపతి.

నెల్లూరు 8-3-38

కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించాలి

మార్చి 20 వ తేదీన దేశమంతటా సభలు జరిపి ఆందోళన చేయండి

★ ★

జయప్రకాశ్, పి. సి. జోషీగార్ల హెచ్చరిక.

1929 మార్చి 20 వ తేదీన బ్రిటిష్ ప్రభుత్వం 32 మంది యోధులగు కార్మిక నాయకులను జాతీయ సేవకులను అరస్టు చేసి మీరటు కుట్రకేసును ఒకటి నడిపింది. మీరటుకేసు ఇండియాలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలవంతంగా అణచడానికి నిషేధించడానికీ సామ్రాజ్యవాదం చేసిన దౌర్జన్యములోని ఒక భాగం.

మీరట్ కేసు పూర్తికాగానే హిందూదేశపు కమ్యూనిస్టుపార్టీ నిషేధించిబడిన దంటూ 1934 జులైలో ప్రభుత్వ ప్రకటన ఒకటి వెలువడింది. అప్పటినుండి కమ్యూనిస్టులపై తీవ్రమైన ఒత్తిడి ప్రారంభమయింది.

ఈనాడు అధికారంలో కాంగ్రెసు మంత్రు లున్నారు. ప్రజలు పౌరస్వత్వ హక్కులు విశాలవంతం చేయబడుచున్నాయి. ప్రజాస్వామ్య పౌరసత్వ హక్కుల ననుభవించాలనే కోర్కె ఎక్కువగా ఉన్నది.

నాగరికతగల అన్ని దేశాలలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం లేదు. ఇక మన ఇండియాలో మాత్రము, కమ్యూనిస్టుపార్టీ బహిరంగముగా ఎందు కుండరాదో కారణము కన్పించడం లేదు.

మీరట్ కమ్యూనిస్టుల అరెస్టుల వార్షికోత్సవదినం సమీపించింది. కమ్యూనిస్టుపార్టీపై నిషేధంతొలగించాలని అడగటానికి ఇంతకంటె అవకాశమైన దినం లేదు. దేశమంతటా, పల్లెలలో, పట్టణాల్లో, సభలు ప్రదర్శనోత్సవాలు, జరిపి, కమ్యూనిస్టుపార్టీపై నిషేధం తొలగించడానికి ఒత్తిడి చేయాలి.

ఈ సంవత్సరపు మార్చి 20 వ తేదీ కమ్యూనిస్టు పార్టీ నిషేధం తొలగడానికి చేసే తీవ్రప్రజాఉద్యమ ప్రారంభాన్ని చూడాలి.

మన ప్రజల పౌరసత్వ హక్కుల కోరే ప్రతి సంఘమువారి సహకారం కోరాలి. కమ్యూనిస్టు భావాలలో నమ్మకమున్నవారు బహిరంగంగా కమ్యూనిస్టు సంఘంగా పని చేసేందుకూ, పార్టీని బహిరంగంగా సంఘటన పరచుకొనేందుకూ, అవకాశమీయాలని ప్రభుత్వాన్ని మన మందరమూ కలిసి సంయుక్తంగా ఒత్తిడి చేయాలి. ఈ యావద్భారతదినాన్ని జయప్రదంగా జరపాలి.

జయప్రకాశ నారాయణ
అ. భా. కాంగ్రెసు సోషలిస్టు పార్టీ కార్యదర్శి.
పి. సి. జోషి
నేషనల్ ఫ్రంటు సంపాదకులు.

★

అ. భా. విద్యార్థిసంఘ కార్యదర్శి విజ్ఞప్తి.

అఖిల భారత విద్యార్థిసంఘ కార్యదర్శియగు అన్సార్ హార్వానీ, జయప్రకాశ్, పి. సి. జోషీగారల విజ్ఞప్తిని బలపరచుచూ మార్చి 20 వ తేదీన దేశమంతటా విద్యార్థులు సభలు జరుపవలెనని రాష్ట్ర విద్యార్థి సంఘములవారికి సర్క్యులర్లను పంపిరి.

★

ప్రముఖుల విజ్ఞప్తి

కమ్యూనిస్టుపార్టీపై నిషేధం తొలగించాలంటూ, ఇదివరలో, మసానీ, నారిమన్ మొదలగు బొంబాయి ప్రముఖులు విజ్ఞప్తి గావించారు.

అలాంటి దే కాన్పూరునుండి, యు. పి. రాష్ట్రంలోని కాంగ్రెసు, కార్మిక రైతు నాయకులు గావించారు. ఆ విజ్ఞప్తి ఇది:—

"కాంగ్రెసు మంత్రులు 7 రాష్ట్రాలలో జాతీయ రాజకీయ సంఘాలమీద, బ్రిటిష్ ప్రభుత్వము విధించిన నిషేధాన్ని తొలగించారు. కాని, ఇండియా కమ్యూనిస్టుపార్టీని, దాని రాష్ట్ర, జిల్లా శాఖలపైన నిషేధం ఇంకా అమలులోనే ఉన్నది. ఈ సంఘముయొక్క కార్యములలో సహాయపడుచున్నారని ఇద్దరు యువకులపైన కేసు ఇంకనూ యు. పి. రాష్ట్రంలో సాగుచూనే వుంది. అలాంటి నేరంమీదనే బెంగాల్‌లో అనేకమంది యువకులు విచారింపబడుతున్నారు. (రెడ్‌గార్డ్ కేసు.) వ్యక్తిగత హింసావాదాన్ని అరికట్టడానికని, ఉపయోగింపబడు నిర్బంధవిధానాలన్నీ, బెంగాల్ లోనూ, పంజాబులోను కమ్యూనిస్టులపై ఉపయోగింప బడుచున్నాయి.

కమ్యూనిస్టులు గాని, కమ్యూనిస్టు పార్టీని గాని తక్షణమే సంఘటిత హింసకు పాల్పడరని అందరికీ తెలిసిన విషయమే. ఇది వారి ప్రాథలవలనను వారిపై పూర్వం పెట్టబడిన కేసులలోను ఋజువగుచున్నది. ప్రస్తుతసంఘ నిర్మాణాన్ని మార్చి సోషలిజం నిర్మించడానికి, పీడిత జనసామాన్యపు వర్గ పోరాటముద్వారా మాత్రమే సాధ్యమవుతుందని, ఆపోరాట క్రమంలో, ఆమార్పును, బలవంతముగా ఎదుర్కొనువారిపై ప్రజాసామాన్యం హింసాయుతమైన పోరాటం సాగించాలని వారు నమ్మితే నమ్మవచ్చు.

మేము ఇతర పార్టీలలాగానే తమ అభిప్రాయాలు వ్యాప్తిజేసుకొనేందుకు కమ్యూనిస్టులకు హక్కులుండాలని తలుస్తాం. ఈ హక్కు ప్రజాస్వామ్య దేశాలగు ఇంగ్లండు, ఫ్రాంసు, అమెరికా దేశాలలో ఉన్నది.

కమ్యూనిజంతో ఏకీభవించినా లేకపోయినా భావ స్వాతంత్ర్యమును ప్రేమించు ప్రతి గౌరవనీయుడు, నాగరికమగు దేశంలో వారి అభిప్రాయాలను వ్యాప్తి నొందించటానికి, ఒక పార్టీగా నుండుటకు కమ్యూనిస్టులకు సంపూర్ణ స్వేచ్ఛ నీయాలని తలంచుతాడు. ప్రసిద్ధ మీరటుకుట్రకేసులో, అల్హాబాదు హైకోర్టు జడ్జిసైతం, తీర్పులో కమ్యూనిస్టు అభిప్రాయాలు కల్గియుంటం నేరం కాదని సెలవిచ్చాడు. పౌరసత్వ హక్కులకు గ్యారంటీ ఇవ్వడం అంటే ప్రతిపౌరుడూ తనఇష్టం వచ్చిన రాజకీయ అభిప్రాయాలను కల్గియుండటమే గాక, ఇతరులనుకూడ తనత్రోవకు తిప్పుకోనేందుకు అతనికి స్వేచ్ఛ ఉండాలి. భావ స్వాతంత్ర్యం, సంఘ స్వాతంత్ర్యము మామూలు సామాన్య పౌరసత్వ హక్కు. ఇది నేటి నాగరీకతకు పునాది. నాగరీకతను రక్షించడానికి వృద్ధి కావడానికీ ఇది ఆధారం. కాబట్టి ఇతర ప్రజాస్వామ్య దేశాలలాగానే, ఇండియాలోని కమ్యూనిస్టులు బహిరంగ పార్టీగా ఉండటానికి హక్కుండాలని కోరుచున్నాం.

మన గొప్ప జాతీయ కాంగ్రెసు సంఘమగు కాంగ్రెస్, ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసినట్టు 7 రాష్ట్రాలలోని కాంగ్రెసు మంత్రులు వెంటనే తమ రాష్ట్రాలలోని కమ్యూనిస్టుశాఖలపై నిషేధం తొలగించాలి. లెజిస్లేటివ్ అసెంబ్లీలలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధాన్ని తొలగించాలని తీర్మానం జేసి కేంద్ర ప్రభుత్వంపైన ఒత్తిడి చేయాలి. యావద్భారత శాఖపైన, దాని సెంట్రల్ కమిటీపైన నిషేధం తొలగించాలి.

ఇలా నిషేధం తొలగించడంవల్ల కాంగ్రెసు మంత్రులు మన దేశంలో జాతీయ జీవనంను సామ్రాజ్యవాద శృంఖలాలనుండి తప్పించి ఒకఅడుగు ముందుకు వేయించినవా రవుతారు. మన దేశం యొక్క సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరే మరొక సోదర పక్షంతో ఐకమత్యత సంబంబంధము కలుగజేసికొన్నవార మగుదుము.

ఇట్లు

ఉమా నెహూరు, మోహన్‌లాల్ సెక్సేనా, యం. యల్. ఎ. (ఢిల్లీ): మోహన్‌లాల్ గౌతమ యం. యల్. ఎ.: ఆచార్య నరేంద్రదేవ్, ఎం. యల్. ఏ.; యస్. యస్. పండిట్ యం. యల్. ఏ.; కపిలదేవ మాలవీయ, యం. యల్. ఎ.; జాతాశంకర్ యం. యల్. ఏ.; దేవీదత్త పంతు.; బి. కె. ముఖర్జీ ఎం. ఎల్. ఏ.; లాల్‌బహద్దూర్ శాస్త్రి యం. యల్. ఏ; వి. డి త్రిపాఠీ యం. యల్. ఏ; విజయసింగ్ పాల్‌సింగ్ ఎం. ఎల్. ఏ.; మిస్ సత్యవతి యం. యల్. ఎ. రాజకుమారసిన్హా; బంస గోపాల్ యం. యల్. ఏ, డాక్టర్ రామమనోహర్ లోహియా; సి. బి. గుప్తా యం. యల్. ఏ.; బాలకృష్ణశర్మ: జోగేష్ చటర్జీ: హరిశంకర విద్యార్థి; రాజారాంశాస్త్రి యం. యల్. ఏ.; బి. యన్. సన్యాల్; మంగల్‌సింగ్ యం. యల్. ఏ.; డాక్టర్ కె. యం. అషరాఫ్; డాక్టర్. జడ్. ఎ. అహమ్మద్.

కాన్పూరు,
22—1—38

స్మృతిచిత్రము

★

కామ్రేడ్ గద్దె లింగయ్య

అయిదు సంవత్సరాలనాటి చిత్రం యిది. కాని యిన్నాళ్లు గడిచినా దానికి పాతతనమేమీ వంటపట్టలా. ఆనాటి నూతనం, ఆకర్షణా ఇంకా వున్నై. పైగా దానికి మెరుగుపెట్టి ఇంకా అందమైనదిగానూ, నిగూఢమైనదిగానూ చూడా చేసింది.

ఒకనాటి సంధ్యా సమయం గుడివాడ వూరిపొలిమేల తూర్పు దిక్కుగా భద్రయ్య కాలువ ప్రవహించుతూ వుంటుంది. దానిగట్టుపైన నిర్జనంగానూ, నిశ్శబ్దంగానూ వుంది. ఒకచోటమాత్రం అయిదారుగురు పడుచుకుర్రాళ్లూ, పండ్లమ్ముకుంటూన్న ఒక వృద్ధుడూ వున్నారు. కుర్రాళ్లు అంటే ప్రపంచనాగరికత తెలుసని గర్వించే నవయువకులు. ఆకతాయితనంగా ఆ వృద్ధునితో వితండవాదం చేస్తున్నారు. వారు తిన్న పండ్లఖరీదు ఇచ్చెయ్యమంటాడు ముసలి బేరగాడు. "ఇప్పుడు లేవు. మరోసారి ఇస్తాం లెమ్మంటారు యువకులు." "ఇదివరకు మీరివ్వాల్సింది 11 అణాలూ- ఇప్పుడు తిన్నవాటికి ఏడణాలూ ఇచ్చేయండి. ఒక బేడసూకలు తీసుకుని మిగిలిన రూపాయీ బజారు దుకాణంవాళ్ళ కివ్వాలి. లేకపోతే రేపు వాళ్ళు పళ్ళు అరువియ్యరు. నన్ను తిప్పుబెట్టక వేగిరం పంపెయ్యండి బాబూ." అని బ్రతిమలాడుకున్నాడు.

కాని వాడి మొర, దుస్థితి ఆ పుచ్చండపిండాల పుర్రెలకేం ఎక్కలా. "మేమేమీ ఎగవేయంలే పోవోయ్ రేపిస్తాం" అని గద్దించారు అంతా ఒక్కుమ్మడిగా. వాళ్ళెగవేసినా లేకపోయినా అప్పుడు మాత్రం వారివ్వవలసింది చేతులో పడకపోతే తన కుండ పొయ్యిమీది కెక్కదు సరేగదా పాతబాకీ యివ్వందే రేపుదుకాణంలో పళ్ళుఅరు వియ్యరు. మర్నాడు బేరంమన్నా, అని లోపల్లోపల కుమిలిపోతూ గత్యంతరం లేక "బాబూ నాకేమీ వెనక తాహతులేదు. తిని ఈ విధంగా ఏడిపించొద్దు. నా కియ్యాల్సిం. దిచ్చి పంపండి. అవి మీకెంతపాటి" అని ప్రాధేయ పడ్డాడు. కళ్ళ నీళ్ళు పెట్టాడు.

పళ్ళన్నీ తిన్న ఆ పెద్ద మనుష్యులకు ఆ దీనుడు డబ్బివక తప్పదనడం చూస్తే వళ్ళు మండింది. "ఇస్తాం లే పొమ్మంటే వదలకుండా శనిలాగ పట్టుకున్నావ్. పోతావా లేదా" అని గర్జించా డొకాయన. "వీడిపని మా తిక్కగావుంది. నే వొదిలించుతా నుండం డ"ని ఎన్నినాళనుంచో ఆముసలివానికాధారంగావున్న కాశీ పండ్ల జంగెడను లాగి జోరుగా ప్రవహించు తూవున్న కాలువలోనికి విసిరేశాడు మరో బాహుబలంగల బలశాలి." నీ రోగం యిల్లాగే వదలా ల్లే." అంటూ ఒకత్రోవు తోశాడు వేరొక ధీరుడు.

ఒక్కుమ్మడిగా వాళ్ళ తాతముల్లె లాగ తిని డబ్బడిగితే అవిధంగా తిడుతూ- తన్నుతూ- పడద్రోస్తూవుంటే దిక్కు- మొక్కూ-లేక ఒంటరియైన ఆ బక్క- చిక్కిన దరిద్ర దామోదరుడు విలపించుతూన్నాడు. కాని ఈ స్వార్థ మయ సంసారంలో దీనుల మొరల నాలకించేవా డెవడు? అక్కడి కతి సామీప్యంలోనే కాలువను క్రాస్ అయి ఏలూరు పోయే రాస్తాను వచ్చేపోయేవాళ్ళ వీనుల్లో ఆ హాహా కారమూ, ఆ క్రందనమూ జొరబడ్డా తెలివితక్కువ నెంతమాత్రం దరి జేరనివ్వక వినీ విననట్లు తమ దారిని పోతున్నారు. అది ప్రపంచ ధర్మమైంది. త్వతజ్ఞానులూ- ఆత్మ జిజ్ఞాసాపరులూ ఇతరుల దుఃఖాన్నీ దుస్థితినీ చూచి అవి "పూర్వకర్మ ఫలితాలు" శాంతంగా సహించడమే కర్తవ్యమ"ని వుపదేశించి పోతూంటారు. ఆ దైవ చింతకులూ- వేదాంత కేసరులూ- పప్రంచం ఇలానిలిచి వున్నందులకు కారణభూతులనబడే మహాత్ములూ అంటారుగదా! "ఇవన్నీ విధిచెయిదములు- భగవల్లీలలు, వీళ్ల దుష్కర్మలకూ- పాపాచారములకూ- పరమాత్ముడు ప్రసాదిం చిన ఫలితాలు. సృష్టి స్థితి లయ కారుని లీలలలో ఆస్తికులైనవారు జోక్యం కలిగించుకోరాదు." అని ఇవీ తరుచు-కాదు అసలు మనకు కన్పడుతుండే ఆమహాత్ముల అమృతమయ వాక్కులు.

ఆదేవిధంగా ఒకళ్ళిద్దరు పండ్లవాని పాట్లు గమనించినా ఆ దౌర్భాగ్యుణ్ణి చూడటమే పాపమనో లేక చూచినా జోక్యం కలిగించు కోకుండా పోవడమే వుచితమనో తమత్రోవను పోయాతు.

ఆ దరిద్రుడు- అసహాయుడు- ఒంటరిగా చేసేదిలేక అలాగే ఏడుస్తూ వున్నాడు.

అంతలో ఒడ్డూ- పొడుగూకలిగిదృఢకాయుడైన ఒకనవ యువకుడు అటు రావడం తటస్థించింది. ఒకతెల్లనిముదుక ధోవతి కట్టుకుని- అదేరకం చొక్కా- తొడుక్కున్నాడు. తన సహజమైన దీర్ఘాలోచనా తత్పరుడై ఆ కాలువగట్టున నడుస్తూ పోతున్నాడు. దిక్కులేక దీనంగాఏడుస్తూన్న పండ్లబేర్గాని కరుణాక్రందనం అతని చెవుల్లో చేరింది. హృదయం వికలమైంది. కళ్లెత్తి ఎదుటగా చూచాడు గదా, నల్గురైదుగురు విలాస పురుషులు కండలు లేక ఎముకల గూడుగా నిలబడి అసహాయ స్థితిలో ఏడుస్తూవున్న ముసలిపీనుగను నవ్వుతూ ప్రేలుతూ చుట్టేసివున్నారు. ఆదీనుడు సహాయంకోసం ఎలుగెత్తి విలపిస్తూ చుట్టుప్రక్కలకు చూస్తున్నాడు.

తెలివిగవాళ్లు యిలాంటి గొడవల్లో జొరబడటం మూర్ఖ మనుకుంటారు. ఎం. ఏ. — బి. ఏ. లు చదివిన విద్యాధికులు దూరంగావుండి "అన్యాయం, అత్యాచారం, "అంటూంటారు కాని పాతికేళ్ళకు పైబడని ఆ యువకుడు, ప్రపంచ మర్మ మెరుగని అధీరుడు అసహాయుడగు ఒక నిర్బలునిపై అమలు జరుగుతూవున్న ఆజట్టు అఘాయిత్యాన్ని సహించలేక పోయాడు. అతడేం ఆస్తికుడు కాడు, తత్వజ్ఞాని అంతకన్నా కాడు, "అది ఈశ్వరలీల మన మొందుకు అందులో జొరబడాల"ని అనుకునేందుకు.

అఘాయిత్యమంటే మొదట్నుంచీ అతని కేవగింపు అలాంటి దాన్నెదుర్కోవాలని వుబలాట పడుతూనే వుందతని హృదయం అంతకు పూర్వం నుంచీ. ఇకనేం అవకాశం దొరికింది గదా వుప్పొంగి వుద్రేకంలో ఆజట్టులో జొరబడ్డాడు. ఒకరౌడీ చేయిపట్టుకుని లాగి గుంజాడు. మరొకణ్ణి ఒకత్రోపు తోసి దూరంచేశాడు. అప్పుడా ముసలి వానిని కొంచె మెడంగా తీసుకొని పోయాడు. మధ్య ఆ యువకు డాకస్మికంగా దాపిరించడాని కాశ్చర్యపడి ఆ రౌడీ జట్టు ఒకక్షణం నిశ్చబ్దంగా అట్టే చూస్తూ నిలబడ్డది.

కొత్తగావచ్చిన యువకుడు "ఏం బాబూ. ఎందు కేడుస్తున్నావు? ఏమిజరిగిందేమిట,"ని అడిగాడు. ఆవృద్ధుడు కన్నీరు కారుస్తూ గద్గద కంఠంతో జరిగింది యావత్తూ ఏకరువు పెట్టాడు. పర్యవసానం తిన్నపండ్లకు ఖరీ దిమ్మంటే తన్ను లివ్వడమే. ఇలాంటివి మన చుట్టూ రోజూ జరగడం మామూలే. అయితే మనకేమీ పట్టవు. అలాంటి వాటిని గూర్చి ఆలోచించడానికి తెరిపెక్కడ?. అయితే సత్యం(ఆయువకునిపేరు)ప్రకృతి మాత్రం ప్రపంచానికి విరుద్ధం. మన కర్తవ్యం అంతరించే అదనులోనే అతని కర్తవ్యం ఆరంభమవుతూ వుంటుంది.

అతడు నిర్భీతిగా దృఢగాత్రంతో రౌడీల నీవిధంగా ప్రశ్నించాడు. "పేరు పండ్లుతిని డబ్బీయకపోగా ఒంటరివాణ్ణి చేసి హింసించడం ఏం న్యాయమండీ?"

జట్టులోఒకడు:-నీకెందుకోయి మధ్య మాయిష్టం వచ్చినట్లుచేస్తాం.

2వ వాడు:-నీకుచెప్పాలె గాబోలే, మహా మొనగాడివి బయల్దేరావని.

3వ వాడు:-బయల్దేరాడురా. వీడికూడా కొంచెం ప్రసాదం కావాలని. అందుకనే అట్లా పొగరుగా మాట్లాడుతున్నాడు.

4వ వాడు:-నీకెందుకు పోవోయ్ నీదారిని. లేకపోతే వాడిగతే నీకు పడుతుంది

సత్యం సత్యహృదయం అత్యాచారానికి ప్రతిఫలం చూపడానికసలే కొట్టుమిట్టు లాడుతోంది. వాళ్ళదుడుకు ఆహ్వానయాన్ని మరీ వుడుకెత్తించినై. కండ్లెర్రబడినాయి. ముఖం క్రోధంతో కాగిపోతోంది. పెదవులు తడబడ సాగేయి.

"మీరుతిన్న పండ్లఖరీదు ఇవ్వందే దుమ్మెల్నికక్కజ్జించి ఒక్క అడుగైనా కదలనివ్వను. మోసం—అన్యాయం చేసిందికాక దబాయించుతున్నారే. ఇదేనా న్యాయం. మీ వేడివక్తం చెయ్యాల్సిన దిదేనా? ఇదే ధైర్యం—ప్రతాపం అనుకుంటున్నారా?" అన్నా డావేశంతో సత్యం.

ఈవిధంగా కాదు యింకా తీవ్రంగానే నడిచింది సంభాషణ. చివరికి గలాటాలోకి దిగింది వ్యవహారం. ఎవని సహాయంకొరకు సత్యం యిందులో చిక్కుకోవలసి వచ్చిందో ఆపండ్లమ్ముకునే ముసలివాడు కొట్లాట సాగడం చూచి మళ్ళా తనమీదెక్కడ పడతారోనని భయంతో తప్పుకొన్నాడు. ఇంక మిగిలింది ఒంటరియైన సత్యం ఒక ప్రక్క— నల్గురైదుగురు దుర్మార్గుల జట్టు రెండో వంక.

అతను పోరాడుతూన్నది న్యాయ ప్రతిష్ఠాపన కోసం. అలాంటివాని హృదయంలో భీతికి తావెక్కడ దొరుకుతుంది? పోట్లాడేడు. శక్తికొలది బాగానే పోట్లాడేడు. అయితే అతని ఎదిరి పక్షం కొన్నిరెట్లధికం. దెబ్బలు బాగా తగిలాయి, కాని అతని కవే మీ స్మృతిలో లేవు. పోరాటాన్ని సాగిస్తూనే వున్నాడు. అత్యాచారానికి ఓడిపోయేకంటె చచ్చిపోవడమే మేలనుకున్నాడు.


అలాంటివాళ్లనే మన రాజకీయ దురంధరులు— విద్వాంసులు— స్వాములవార్లు పత్రికాసంపాదకులు పిచ్చివాళ్ళనీ, దౌర్జ

(మిగతా 14 వ పేజీలో)

ప్రపంచ దారిద్ర్య విముక్తికి మార్గము చూపిన మహాపురుషుడు దారిద్ర్యముతోనే కృశించాడు

★

కారల్ మార్క్సు జీవితగాథ



1883 మార్చి 14 వ తేదీ ప్రపంచ శ్రామిక వర్గ మంతా—ప్రపంచ పీడిత జను లంతా—ప్రపంచ శాంతిని కోరే వారంతా దుఃఖించిన దినం.ఆనాడు కారల్ మార్క్సు అస్తమించాడు. అతని మరణంతో ఒక యోధుడు—ఒక తత్వవేత్త— ఒక ఆశా జ్యోతి కనపడకుండా పోవడం తటస్థించింది.

మార్క్సు మరణించాడు. కాని మార్క్సిజం బ్రతికి ఉంది. బ్రతుకుతుంది చిరస్థాయిగా....

కారల్ హీన్ రిచ్ మార్క్సు, 1818 మే 5 వ తేదీన ప్రష్యాలోని ట్రేవస్ అనే గ్రామంలో జన్మించాడు. మార్క్సు తండ్రి వకీలు. 1824 లో అతడు 'యూదుల' మతం వీడి క్రైస్తవ మతం స్వీకరించాడు.అతడు విద్వాంసుడుకూడ. మార్క్సు తల్లి హాలండు వాసిని. తన కొడుకు బాగుపడాలని తలచేది."మార్క్సు ఆర్థిక శాస్త్రం గురించి వ్రాసేకన్నాఅతడా డబ్బును సంపాదిస్తే బాగుండును." అని తలచేది. కాని ఆమె కోర్కె సిద్ధించితే మార్క్సు కుటుంబం సుభిక్షంగ, సంపదోపేతంగా, హాయిగా ఉండేది. కాని ప్రపంచానికి ఒక ఆశ—ఒక విప్లవం- ఒక వెలుగు ప్రసాదించే మార్క్సు లేకపోయేవాడు.

చిన్నతనంలోనే మార్క్సు ప్రతిభ ...ండేది. ఒక పట్టణపు పాఠ...డు ప్రవేశించాడు. అతనంటే ...ర్థులకు ప్రేమా ఉండేది. ...మూ ఉండేది. ఆటపాటల్లో ఉత్సాహంగా ఉండే అతన్ని జూస్తే అందరికీ ప్రేమ. అతనితో విరోధం పెట్టుకొన్నవారిపై పద్యా లల్లి పరాభవం చేస్తా డని భయం. మార్క్సు ఉన్నత కళాశాలలో విద్య పూర్తిచేసి 1835 లో బాన్ విశ్వవిద్యాలయంలో ప్రవేశించాడు. ఇక్కడ ఒక సంవత్సరం దాకా 'లా' చదివాడు. 1836 లో బెర్లిన్ విశ్వవిద్యాలయంలో ప్రవేశించాడు. ఇక్కడ 'లా' చరిత్ర, భూగోళం, సాహిత్యం, తత్వశాస్త్రమూ పఠించసాగాడు. ఈరోజుల్లో అన్నీ కంఠతా పట్టాలని కుతూహలం ఉండేది. ఒకసారి తనను గురించి ఇలా కవిత్వం చెప్పుకొన్నాడు. "నా ఆత్మలో ఎలాంటి శక్తి ఉన్నదో కాని, ఒక్క పనినీ శాంతంగా చేయనీయదు."ఇంత ఉత్సాహ ఉద్వేగాలలో అతని కాలేజీ జీవనం నడిచింది. ఏవో 3 పుస్తకాలు కవిత్వ దృష్టితో వ్రాశాడు. తర్వాత హెగెల్ తర్క శాస్త్రాన్ని చదివాడు. "గ్రాడ్యుయేట్సు"క్లబ్బులోహెగెల్ సిద్ధాంతాల మీద చర్చించుతూ ఉండేవాడు. ఈ చర్చలలో అతని మేధాసంపత్తిని చూచి అందరూ ఆశ్చర్య పడుతుండేవారు.కాని మార్క్సు తండ్రి ధోరణి వేరు.

★

మార్క్సు ఏదైనా ఉద్యోగంచేస్తే బాగుంటుందని అతనికోరిక. కాని లాభం లేకపోయింది. పోనీ 'నెపోలియన్' మీద ఒకగ్రంథం వ్రాయమని తండ్రి కోరాడు. కాని లాభంలేదు. పూర్తిగా తర్క-తత్వశాస్త్రాలలోమునిగిపోయాడు. మార్క్సు-చివరకు తనకవిత్వంపైకోపం వచ్చి తగలవేశాడు అన్నీ. 1841 లో తత్వశాస్త్రంపై ఒక మహాగ్రంథం వ్రాశాడు. ఇతనికి విశ్వవిద్యాలయంలో ఆచార్యపదవిని ఇస్తానన్నారు. స్వీకరించ లేదు. ఈ రోజులలోనే ప్రభుత్వం క్రూర పద్ధతుల దాల్చింది. ఆనాటినుండి రాజకీయాలలో ప్రవేశించక తప్పిందికాదు మార్క్సుకు.

రాజకీయాలలో ప్రవేశించిన మార్క్సు "రేనిష్ గజెట్" అనే పత్రికను సాగించాడు. మొదట ఈపత్రికకు రూటన్‌బర్గు సంపాదకుడు. 1842 జనవరి ఒకటవ తేదీన మొదటి పత్రిక వెలువడింది. 1842 అక్టోబర్ లో రూటన్‌బర్గు సంపాదకత్వాన్ని వదలుకొన్నాడు. అపుడే మార్క్సు ఆస్థాన మాక్రమించాడు, కార్యాలయం మార్చి పత్రికను అభివృద్ధికి తీసుకవచ్చాడు. అతని విప్లవపూరిత వ్యాసాలు చూచి ప్రభుత్వం నిషేధించింది. అంతటితో ఆపత్రిక ఆగిపోయింది. కనీసం తనపేరును సంపాదకత్వంనుండి తీసివేసి ఎలాగైనా పత్రిక నడపాలని చూచాడు. కాని ప్రభుత్వం అడ్డువచ్చింది. ఆనాటినుండి పూర్తిగా రాజకీయవేత్త మార్క్సు.

★

కారల్ మార్క్సు "జెన్నీవాన్ వెస్ట్ ఫాలెన్" అనే ఆమెను పెండ్లి చేసికొన్నాడు 1843 లో. ఈమె మార్క్సు సహాధ్యాయిని. ఈ వివాహంవల్ల మార్క్సు తండ్రివల్ల చీవాట్లు కూడ తినకపోలేదు. ఆమె సౌందర్య గుణాలు మార్క్సుని ఆకర్షించినాయి. ఆమె ధనిక కుటుంబానికి చెందినా అతని దేశభక్తి, ప్రతిభా విశేషాలు ఆమెను ఆకర్షించినాయి. తన భార్యతో కూడ మార్క్సు పారిస్ నగరం పోయాడు. అక్కడ తన మిత్రుడయిన 'అర్నాల్డ్‌రజ్"తో కూడ ఒక పత్రికను నడుప యత్నించాడు. జర్మనీలో కర్షకుల దుస్థితి చూచి, ఫ్రాంసులోని తీవ్రవాద మిత్రులను చూచినపుడు మార్క్సు ఫ్రాంసు వెళ్ళక తప్పదనుకొన్నాడు. ఆ రోజుల్లో ఒక మిత్రునికి ఇలా ఉత్తరం వ్రాశాడు. "నేటి ఆర్థిక ప్రణాళికవలన- దోపిడి చేసే సమాజం వలన ఒక భయంకర విషమస్థితి ఏర్పడింది. దాన్ని బాగుపరచడానికి ఒక నూతన శక్తిని వెదుకుదామన్నా పూర్వ శాస్త్రాలలో ఎక్కడా లేదు."ఇతడు మిత్రునితో కలిపి నడిపిన 'జర్మన్ డైరీ బుక్' ఒక సంచిక మాత్రమే వెలువడింది. దీనికి కారణం మార్క్సు,రజ్‌లు ఏకీభవించకపోవడమే. ఈ పత్రికలోనే ఎంజెల్సు ఒక వ్యాసం అర్థశాస్త్రంమీద వ్రాశాడు. అదివరకే ఎంజెల్సు జర్మను రైతులపైన ఒక వ్యాసంవ్రాశాడు.ఈవ్యాసాలు మార్క్సును ఆకర్షించినయి. వారిద్దరికి స్నేహం ప్రబలింది. 1844వ సంవత్సరంనుండి పారిస్ వచ్చి మార్క్సుతో నివసింప సాగాడు అతని ఎంజెల్సు.

ఫ్రెడరిక్ ఎంజెల్సు, కారల్ మార్క్సుల కృషిఫలితంగా ఈపీడిత ప్రపంచానికొక త్రోవచూపించారు. అదే "మార్క్సిజం"

★

పారిస్‌లో నున్నన్నాళ్ళు మార్క్సు ఫ్రెంచి ప్రభుత్వానికి ఒకభయంకర విప్లవకారిగా కన్పించాడు. అందుకని అతన్ని వెళ్ళగొట్టేరు. మార్క్సు బ్రస్సెల్సు (బెల్జియం) వెళ్ళాడు. ఇక్కడ ఎంజెల్సు సహాయంచేశాడు. వారు కమ్యూనిస్టు సంఘం ఒకటి ఏర్పరచారు. ఈసంఘ సమావేశాలు రెండు 1847లో లండన్‌లో జరిగాయి. రెండవ సమావేశపు తీర్మానం అనుసరించి వీరిద్దరు 'కమ్యూనిస్టు మానిఫెస్టో' తయారు చేశారు. ఇది 1848 లో ప్రకటించారు. ఈగ్రంథం ప్రపంచంలో అనేక భాషలలోకి తర్జుమా అయింది. మన భాషలోకూడ తర్జుమా అయి ప్రభుత్వంచేత నిషేధింపబడింది.

ఇంతకు ముందు 1847 లో మార్క్సు ఒక గ్రంథం వ్రాశాడు. దాని పేరు "పావర్టీ అఫ్ ఫిలాసఫీ". 1848లో మళ్లా విప్లవం రేగింది. పారిస్ వెళ్ళి మార్క్సు ఫ్రెంచి విప్లవంలో పాల్గొన్నాడు. ఫ్రెంచి విప్లవ ప్రభావం జర్మనీపైకూడా పడింది. రైన్‌లాండ్‌లో విప్లవ పరిస్థితు లేర్పడ్డాయి. అప్పుడు మార్క్సు తన దేశీయుల కుపకరించేందుకు మరో పత్రిక పెట్టాడు. ఫ్రాంసు విప్లవాన్ని సమర్థించాడు. జర్మనీ ప్రభుత్వం రైన్‌లాండ్ విప్లవాన్ని అణచింది. మార్క్సు పత్రికనుకూడా ఆపివేయాలని ఆజ్ఞాపించింది. 1849 మే 18 వ తేదీన "రక్త సంచిక" ఒకటి ప్రకటించాడు మార్క్సు. అన్నీ ఎర్రకాగితా లుపయోగించాడు. దీనివల్ల మార్క్సు ఆస్తి అంతా అప్పులవాళ్లు కట్టుకొన్నారు. 3 సార్లు కేసు పెట్టారు. చివరకు 1849 లో దేశంనుంచి వెళ్ళగొట్టారు. ఫ్రెంచివిప్లవం తర్వాత జర్మనీ వచ్చిన ఇతనిని దేశంనుండి తర

(మిగతా 12 వ పేజీలో)

కాలేజీ ప్రిన్సిపాల్ గారికి రెండవ లేఖ

కాకినాడ విద్యార్థుల కష్టాలు

ఆర్యా,

ఇదివరకొక లేఖ వ్రాశానుమీకు. ఇంకా హాస్టలును గురించిన విషయాలు కొద్దిగా ఉన్నాయి. వాటిని పూర్తిచేసి కాలేజీవిషయం మాట్లాడ తాను. మీ వార్షికోత్సవోపన్యాసంలో, విద్యార్థుల హక్కుల కేమి భంగం కలిగించాననే మీ ప్రశ్న మా హృదయాంతరాళంలో గింగురు మంటూంది. ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి సంఘానికి ప్రతినిధి అనదగిన విశాఖపట్నంలో వెలువడుతూన్న ఆంగ్ల మాసపత్రిక Student's Voice విద్యార్థి బృందానికి ప్రేమపాత్ర మై ఆంధ్రవిద్యార్థుల గౌరవమన్ననలను పొందింది. అలాంటి పత్రికను, వసతిగృహ పఠనమందిరంలో పెట్టాలని విద్యార్థులు కోరితే వార్డెనుగారు నిరాకరిం చిన మాట మీకు తెలియకపోదు. విద్యుచ్ఛక్తిని గురిం చిన ప్రశ్న మరోటి బయలుదేరింది. ఆవిశాలంలో హాస్టలు కేదో ఖర్చయిందని, దానిని రాబట్టడానికి, విద్యార్థికి 1—4—0 ఖర్చు కానప్పటికీ వసూలు చేస్తూన్నామని మీరు వప్పుకున్నారట నిజమేనా? మీ అనుజ్ఞలేకుండా రోజూ ఎవరో ఒకరు హాస్టలు లోపలకు వస్తూ పోతూ ఉంటారు. కొందరు పేదవాళ్ళు చందాలకు వస్తారు. కొందరు బంధువులను చూడడాని కని వస్తారు. ఇంకా ఇతర పనులపై వస్తారు. మీరు రోజూవార్తాపత్రికను చదువుతూంటారు. వార్డెనుగారు కూడా చదువుతూఉంటారు. స్పెయిను భూమి అగ్ని జ్వాలలో ఆహుతవుతుందని తెలుసు. ప్రజాసామాన్యము లోని, కార్మిక కర్షక యువక విద్యార్థులంతా వాళ్ళమాతృ భూమి సంరక్షణకు, ఆత్మార్పణ చేస్తూన్నారని మీకు తెలుసు. తమ దేశరక్షణకు, సోదరీమణులెందరో సైన్యాలలో చేరి సహాయం చేస్తూన్నారని, అఖరకు ఒక సోదరీమణి, సైనికదుస్తులలో నుండగా మాడ్రిడు పట్టణాన్ని కాపాడుతూన్నట్లు 'హిందూ' పత్రికలో వేసిన ఛాయాచిత్రాన్ని మీరు మరచిపోలేరనుకుం టాను. అలాంటి వీరులకు వీరయువతుల సహాయా ర్థము, ధనము ప్రోగుచేస్తూంటే, విద్యార్థులు కృత జ్ఞతాపూర్వకంగా తమకు తోచిందిస్తూంటే, వార్డెను గారడ్డుపరచిన మాటను కాదనగలరా? సలహాసంఘం రాజీనామా సందర్భంలో ఒక విద్యార్థి జ్వరంతో బాధ పడుతూంటే మీరు అతనిని నిద్రలేపి బలవంతంగా బయటకు రప్పించారు జ్ఞాపకముందా? ఫలహారం తినకపోయినప్పటికీ, దాని ఖరీదు వసూలుచేయడం నిజమేనా? అధ్యక్షా: ఇవి విద్యార్థుల వసతిగృహాన్ని గురించి.

ఇకవిద్యార్థినుల వసతిగృహాన్ని పరిశీలిం చాలి. చేసినవంటకాలలో అప్పుడపుడు పురుగులు కనుపడుతున్నాయట. కాని వారు మీకు చెప్పలేకపో తున్నారు. చెప్పినంతవరకయినా, ఆ హాస్టలు ప్రతిని ధినికి చెప్పుతూంటారు. వారినుండి మీకు చేరేవెన్నో! చేరనివెన్నో!! దాచియుంచబడినవెన్నో!!! ఇది చూస్తే సహాయ నిరాకరణోద్యమం జ్ఞాపకాని కొస్తుంది. ఈ భోజనం, మూడవ క్లాసు రాచకీయ సోదరులకిచ్చిన చక్రవర్తిగారి ఆతిథ్యం జ్ఞాపకాని కొస్తుంది. జైలునుగురించిన విషయాల్లో నిది మొదటి పోలిక. వారి గదులకు కిటికీలు, జైలులోవలె, అకా శానికింటి ఉన్నాయనుకుంటాను. ఆ కాస్త స్థలంలో చాలా గదులు కట్టారు. వారికేపైన గాలి పీల్చే యోగ ముందో లేదో నాకనుమానంగా ఉంది ఎవరైనా స్నేహితులతో మాట్లాడాలంటే, ప్రక్కనే ప్రతినిధిని గాని, యింకా మ్యాట్రను గాని నిలబడి వారివ్యక్తిగత సంభాషణ వినడం ఘోరంగాఉంది. జవహరు సోదరు డీ పట్టణం వస్తే, సోదరీమణులు, ఆయన ఉపన్యా సం వినడానికి మిమ్ముల నడిగితే మీరు అనుజ్ఞ నివ్వ లేదు జ్ఞాపకముందా? సోదరీమణులకు వచ్చే ఉత్తరా లను కొన్నిటిని, చదవ్వయినప్పటికీ, చదివిగాని వారి కివ్వరని తెలిసింది నిజమేనా? ఇది చాల దారుణం. జయిలులో కొన్ని విషయాలలో ఉత్తరాలు చదవ కుండా యిచ్చినరోజు లున్నాయనుకుంటాను. కాని సోదరీమణుల పాపమేమిటో: భోజన విషయాలను గురించి, హాస్టలు కార్యదర్శి, సోదరీ మణుల హాస్టలు ప్రతినిధికి. ఎలా ఉండని చెయింపినందులకు మీరు:

> "కనుంగొని కోపవేగమున
>
> గన్నుల నిప్పులు రాల సంగముల్
>
> గనలగ సాంద్ర మున్న నలి
>
> [illegible]యులు గ్రీష్మ, నితాంత దంతపీ
>
> [illegible]న [illegible]ట దాస్యరంగ వక
>
> ట భ్రుకుటీ చటుల ప్రవృత్తన
>
> [illegible]న ఘటనా ప్రకార భయ
>
> విస్ఫురణా పరిశుద్ధమూర్తియై"

గర్జించారట నిజమేనా? Co-education అంటే యింకా మీ ఉద్దేశ మేమిటో సెల విప్పించండి. ఇలా మమ్మల్ని వేధించడం న్యాయం గాదు. మా స్వాతం త్ర్యంతోపాటు, మా విధి గూడా మాకు తెలుసు. మాటి మాటికి జవహరు ఉపదేశాన్ని స్మరించకండి. జవ్హరు మా స్వాతంత్ర్యం భంగమయేటట్లు చేయమని ఎప్పుడూ చెప్పలేదు. కాని స్వాతంత్ర్యంతోపాటు, విద్యార్థులు విధులను మరువవద్దన్నాడు. మా న్యాయ మైన హక్కు చెప్పినప్పుడు, విధులు, విధు లంటారు గాని మా హక్కులను నెరవేర్చారా? హాస్టలు సలహా సంఘాన్ని, కార్యసంఘంగా మారిస్తే, వార్డెనుగారిని బయటకు నెడతారు. విద్యార్థులని మీ రనడం నాకు చాల విచారాన్ని కలుగచేసింది. న్యాయాన్యాయ విచ క్షణగల వార్డెను విద్యార్థుల స్వాతంత్ర్యాని కరికట్టే ప్రయత్నం తాను బలవంతాన చేయవలసివస్తే తానే బయటకు వెళ్తాడు. వెళ్ళకపోతే వెళ్ళగొట్ట బడతాడు. కాని పరస్పర స్నేహంగా సంచరించేటప్పుడు గూడా విద్యార్థు లలాచేస్తారనడం మానవ స్వభావాన్ని మరచి పోవడం. కాబట్టి అలా విద్యార్థులకు పేరు పెట్టడం మంచిది కాదని మనవి చేస్తున్నాను.

ఇక కాలేజీకి వద్దాము. పోయిన సంవత్సరం విద్యార్థి సంఘాన్ని బలవంతంగా తీసివేయించారు. ఆ విషయాలన్నీ, "గిరికుమారి డైరీలూ, విద్యార్థిని డైరీలూ" చిత్రగుప్తలో చాటాయి. ఈ సంవత్సరం, బాట్లీవాలాపైని మీ కంతులేని కోపం వచ్చిందని తెలి సింది విద్యార్థులలోప్రబోధం కల్గించాడని. ఆగస్టు28,29 వ తేదీలలో ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి మహాసభ గుంటూరులో జరిగింది. కాని మీరు 21, 22 వ తేదీలనుకున్నారు. 23 వ తేదీ ఎవరో విద్యార్థులు వారి పనిమీద రాకపోతే, మహాసభకు వెళ్ళాడని, అతనిని నమ్మక, అతని సెలవు దరఖాస్తు వారి ఉపాధ్యాయుడు వప్పుకొనలేదట నిజమేనా? కోర్టు ఆఫ్ ఆనరు అనేది మీ కాలేజీలో ఉంది. సభ్యుల్ని నవంబరులోనే ఎన్నుకున్నారు కాని వారి నింతవరకు సమావేశపరచకుండా, విద్యార్థులపై జరిమానాలు విధి స్తూన్నారట నిజమేనా? బైనానిధికి, మా విద్యార్థులకు పూర్వము వసూలు చేసిన నిధి నిలువనుండి, కొంత పంపాలని తీర్మానం పెడితే, మీరు పంపిన ప్రతినిధి గారు మీటింగులో, యీకమిటీ కి దాన్ని ముట్టడాని కధికారము లేదన్నారట నిజమేనా? కాలేజీ, ఎక్సెల్సియర్ యూనియనుకు, కోర్టు ఆఫ్ ఆనర్‌కు, స్వాతంత్ర్యములేని, స్వరాజ్యాన్ని సమర్పించదలచారా?

ఎక్సెల్సియర్ యూనియను కార్యదర్శితో మీరు ఆది వారం రోజున, సోమవారం సాయంకాలం కోర్టు ఆఫ్ ఆనర్ అధ్యక్ష, రెజిస్ట్రారుల ఎన్నికలు జరుపుతామని చెప్పారు జ్ఞాపకముందా? ఎన్నికలంటే నామినేషనులు ను. స్వారాజ్యమంటే నియంతృత్వం కాదనుకుంటాను. కాని మీరు ఎన్నికలను జరిపారా? వార్షికోత్సవం సందర్భంలో మీరిపోర్టులో సదాశివరావు అధ్యక్షుడని, అచ్చిరెడ్డి రిజిష్ట్రారనీ చదవడంలో మీ వుద్దేశ్య మేమిటి? మీరు ఆరిపోర్టు చదివేవరకూ అచ్చిరెడ్డికి తన పదవి సంగతే తెలియలేదు. వారికి, మీ నియంతృత్వం పద్ధ తిని తెలుపక నామినేటు చేయడంలో మీ వుద్దేశ్య మేమిటి? కోర్టు ఆఫ్ ఆనర్‌నుపిలిచే అగత్యతే కలుగ లేదని రెండవ రోజు వార్షికసభలలో గంభీరోపన్యాసం గొట్టారు. విద్యార్థులకు జరిమానా విషయాలలో పో యినసంవత్సరం, కోర్టుఆఫ్ ఆనర్‌తో సంప్రతించారు. ఈ సంవత్సరం సంప్రతించక జరిమానా విధించ డంలో మీ ఉద్దేశ్య మేమిటి? ఆ విషయమై రామా రావుగారు అడగడానికి నిలబడితే కూర్చొనమని సైగచేశారు మీరు. మరోవిషయం మిమ్ముల నడగాలి. [illegible], మీ ఉద్దేశ్యంలో ఊరిలోని పెద్దలకేగాని విద్యార్థులకు కాదు. పెద్దల్ని పిలిచి, సగం హాలు పూర్తిచేసి, చాలమంది విద్యార్థుల్ని బయటకు నెట్టారు. బయట 300 మంది విద్యార్థుల్ని నేను చూశాను. మీటింగు మధ్యనే మంత్రులు రామారావు నరసింహారా వుగారలు, హాస్టలుకు వెళ్ళారు. బయట విద్యార్థులు, ఆగలేక తలుపులు నెట్టి లోపలి కొచ్చారు. [illegible] తెలిసి రామారావు, నరసింహారావుగారలు వారిని ప్రతిమాలి వెనుకకునెట్టారు. నాశనంగాబోయే వార్షికాన్ని రక్షిం చారు. కాని ఆ విద్యార్థుల సైకిళ్ళు, లోప లున్నాయి. అవి వాళ్ళ కివ్వడానికి మీదగ్గరకొస్తే. మీ రెలా మాట్లాడారో జ్ఞాపకముందా? జరిగిన అల్లరికి నరసిం హారావు, రామారావు వారి గ్యాంగు కారణ మన్నారు. ఇదేం భాషో సెల విప్పించండి. న్యాయం కాగదు. గ్యాంగు అంటే మీ అర్థం యేమిటి? ఇది క్షుద్రదాయకుల సంఘం అనుకున్నారా? రామారావు నరసింహారావుల సహాయాన్ని.

(తరువాయి 10వ పేజీలో

★ నేటిప్రపంచం ★

"మున్ముందు ఈ చిన్న చిన్న నాజీ గడబిడలే ఒక తిరుగుబాటు తీస్తా యన డానికి.... రేపుత్వరలో ఒకఫేసిస్టు తిరుగు బాటుతో ఆస్ట్రియా జర్మనీకి అర్పణం అయినా ఆశ్చర్యపడవలసిన అగత్యం లేదు"—అని క్రిందటిసారి వ్రాశాం.

ఇంతలోనే ఈ జోస్యం ఫలించుతుం దని అనుకోలేదు. అయిపోయింది. అస్ట్రియా జర్మనీకి ఆహుతి అయింది.

ఈ వారపు పరిస్థితులు ఎంత త్వరి తంగా అభివృద్ధి అయ్యాయో చెప్పే ముందు ఆస్ట్రియా చరిత్రను గురించి కొంత చెప్పాలి.

★

ఆస్ట్రియా మధ్య యూరప్‌కు నాభి వంటిది. ఒక ప్రక్క ఇటలీ సరిహద్దు. ఇంకో ప్రక్క జర్మనీ. మరొక ప్రక్క స్విట్జర్లండు దాటితే ఫ్రాన్సు. పోతే ఇంకా చెప్పుకోదగినవి జకోస్లోకేవియా, హంగేరీ జుగోస్లేవియా దేశాలు. ఈ మూడూ చుట్టూ ఉన్నాయి.

ఆస్ట్రియా 1919 లో ఫెడరల్ రిప బ్లిక్‌గా మారింది. యుద్ధము పూర్తి అయాక ఆస్ట్రియా పరిస్థితులు బాగుండ లేదు. సుంకపు ప్రతిబంధకాలవలన, ఎగు మతి వ్యాపారం తగ్గడం, నాణెం విలువ పడిపోయి (Deflation) వస్తువుల ధర హెచ్చడం వీటివలన ఆస్ట్రియాసర్వనాశన మయింది.

ఇలాంటి సమయంలో ఇతర దేశాలు అప్పు పెట్టినయి. ఎప్పుడూ అప్పుతో గడిచేది ఎట్లా? అందుకనే ఈ సుంకాల విషయమై ఏదో ఒక నిర్ధారణకు వచ్చి స్వేచ్ఛా వర్తకం చేసికోవాలని, ఆస్ట్రియా-జర్మనీలలోని సోషల్ డెమాక్రెటిక్ పార్టీల వారు తలచారు. 1930 లో ఈసూచన తెచ్చారు. కాని ఫ్రాంసుదీని కంగీకరించ లేదు.

★

ఇదే సమయంలో అంతరంగికంగా అనేక పోట్లాటలలో మునిగింది ఆస్ట్రి యా. సోషలిస్టులకు ఇతరులకు, పల్లె లకు పట్టణాలకు, మతసంబంధ కల హాలు ఈవిధంగా అరాచకం ప్రబలింది ఈరోజుల్లో.

ఆస్ట్రియాతోపాటు జర్మనీ చరిత్రకూడ పరిశీలించాలి. ప్రపంచయుద్ధంలో దెబ్బ తిన్నాక జర్మనీ సోషల్ డెమాక్రటిక్ పార్టీ వాళ్లుతమఅధికారంలో ప్రజలను సంతృప్తి పరచలేకపోయారు. సోషల్ డెమోక్రటిక్ పార్టీ అంటే సోషలిస్టు పార్టీ. సోష లిస్టులకు కమ్యూనిస్టులకు భేదం ఉండేది. 1923 లో శైశవావస్థలోఉన్న కమ్యూ నిస్టుపార్టీకి, సోషలిస్టుపార్టీకి, విభేదాలు ఉండేవి. "అంతర్జాతీయంగా ఆలోచించా లని" కమ్యూనిస్టులు, "ఇప్పుడున్న ప్రజా స్వామ్యాన్ని—దేశాన్ని కాపాడాలి" అంటూ కార్మిక తిరుగబాట్లను అణచారు సోషలిస్టులు. ఈవిభేదాలతో ఇద్దరూ ఫేసిస్టు భయాన్ని గుర్తించలేదు. చివ రకు సోషల్ డెమాక్రేటిక్‌పార్టీ పదవుల బట్టుకొని వ్రేలాడుతూ ఫేసిస్టులకు క్రమంగా లొంగిపోయారు. 1933 నాటికి హిట్లర్‌కు పూర్తిగా అధికారం వచ్చింది. దీనితో ఆస్ట్రియా రాజకీయాలూ మారి నవి.

★

హిట్లర్ బెదరింపులకు ఒక ఎత్తువే శాడు ఆనాటి చాన్సలరగు డోల్ఫస్. ఆస్ట్రియాపై కన్నువేసిన మరో ఫేసిస్టు నాయకుని—ముస్సోలినీ ప్రక్క చేరాడు. ముస్సోలినీ డోల్ఫస్‌కు చేయూత ఇవ్వ డంలో హిట్లర్‌కొంచెం ఆగాడు. కాని దీనికై డాల్ఫస్ ముస్సోలినికి ఒకలంచం ఇచ్చాడు. ఆలంచం ధనంకాదు. భూమి కాదు. మానవరక్తం.

1934 ఫిబ్రవరిలో కార్మికులను కాల్చా రు. చంపారు. ఆనాటితో ఆస్ట్రియాలోప్రజా స్వామ్యం అంతరించింది. సోషలిజమూ నాశనమయింది. కాని ఈమానవ హంత కుడూ ఎన్నాళ్ళో బ్రతకలేదు. నాజీపక్ష నికి కన్నెరగాఉన్న డోల్ఫస్‌ను ఖూనీ చేశారు 1934 జూలైలో. ఆనాడు నాజీ తిరుగుబాటును ముస్సోలినీ సైన్యాలే ఆపి నాయి. ఆదెబ్బతో నాజీలపై నిషేధం పుట్టింది నాజీపార్టీ నిషేధించబడింది. డోల్ఫస్ తర్వాత షూషినిగ్ ఛాన్సెలర్-అయాడు. ఇన్నాళ్ళదాకా ఎలాగో కళ్ళెం పట్టుకొంటూ వచ్చాడు.

ముస్సోలినీ ప్రాబల్యం తగ్గి హిట్లర్ ప్రతిభ హెచ్చగానే షూషినిగ్ 1936 జూలైలో హిట్లర్‌తో ఒక ఒడంబడిక చేసికొన్నాడు. అస్ట్రియా స్వాతంత్ర్య భంగంలేకుండానూ, జర్మనీ జాతి ని గురించి ఆలోచించడానికి ఒడంబడిక. దానితో కొంత నాజీల పలుకుబడి వృద్ధి అయింది. నాల్గు వారాల క్రితం హిట్లర్ షూషినిగ్‌ను బెదరించి కొన్నిషరతులకు లోబడేటట్లుచేశాడు. దీనివలన నాజీపార్టీపై నిషేధంపోయింది. క్రొత్త మంత్రివర్గంలో నాజీలుకూడ వచ్చారు. దీనితో నాజీలు అల్ల రులు ప్రారంభించారు- ఇదీపూర్వకథ. దీనితర్వాత జరిగిన విషయాలన్నీ క్రిందటి సారి వివరించాం. ఇక ప్రస్తుతానికి వద్దాం.

స్వాతంత్ర్యం లభించిన నాజీలు ఊరుకోలేదు. అల్లరులు ప్రారంభించారు. ఈ అల్లరులను అణచవచ్చిన నాజీమంత్రి సెయస్-ఇన్‌క్వార్టు వాళ్ళ కనుకూలం గానే ప్రకటించాడు.

ఈ గడబిడలతో షూషినిగ్ ఒక ప్రక టన గావించాడు. ఆదివారంనాడు (నిన్న) 24 ఏండ్ల పైబడిన వారంతా ఓటు ఈయాలని. "మీరంతా సంయుక్త ఆస్ట్రియా ప్రజాస్వామ్యంకోరుతున్నారా? లేదా?" దీనికి సమాధానం వ్రాయాలి ఓటర్లు.

నాజీలు యెంతమంది ఉన్నా దీనికి ఔను అంటూ వచ్చే సమాధానం ఎక్కువ ఉంటుంది. అందుచే ఎన్ని ఆపివేయా లంటూ కోరారు. జర్మనీ కూడా కోరింది. షూషినిగ్ ప్రకటన దేశంలో ప్రజా సామ్యం కోరేవారందరూ సంతసించారు. ఫ్రాంసు, ఇంగ్లండులు సంతసించాయి. కాని ఇటీవలనే జర్మనీతో సంధి చేసి కొన్న ముస్సోలినీ మౌనముద్ర వహిం చాడు. జర్మనీ ఎన్నికలు ఆపివేయా లన్నది.

నాజీపక్ష మంత్రికూడా దీనివలన జర్మ నులకు స్వాతంత్ర్య భంగం కల్గుతుం దన్నాడు. స్టిరియాలోని నాజీల కోర్కె లకు అచ్చటి గవర్నరు అంగీకరించ లేదు. దానిలో 2000 మంది నాజీలు ప్రదర్శనం గావించారు. క్రొత్త ప్రభు త్వం రావాలంటూ కేకలు వేశారు.

★

నాజీ గడబిడ ఇలా ఉంటే ఆస్ట్రియా కార్మికులు మళ్ళీ ఒకసారి తల యెత్తారు. 1934 కార్మికులను అణచిన తరువాత నాల్గేండ్లకు ఈనాడు ఒక సోషలిస్టు సభ జరిగింది. వీరు షూషినిగ్‌ను బలపరచి నందుకుగాను కార్మికులకు ఇంకా కొన్ని హక్కులీయమని కోరారు. కాని చేతులు కాలాక ఆకులకై వెదకిన లాభం ఏమిటి? అప్పుడే షూషినిగ్ చేతులుదాటి పోయాయి వ్యవహారాలన్నీ.

ఆదివారం నాడు ఎన్నికలు నాపవలె ననీ, షూషినిగ్ రాజీనామా ఇవ్వాలనీ జర్మనీ ఆజ్ఞాపించింది. ఎన్నికలు ఇది వరకే తాత్కాలికంగా అపుచేయబడినాయి. ఆస్ట్రియా సరిహద్దులలో జర్మనీ సైని కులు నడిచారు. వియన్నా పట్టణంపైన జర్మను విమానాలు ఎగిరినాయి. ఈ నాజీ దుడుకుతనంను ఆపలేక లొంగిపోయా నంటూ షూషినిగ్ ప్రకటన చేసి రాజీనా మానిచ్చాడు. నాజీ మంత్రివర్గం క్రొత్తది ఏర్పడ్డది. దీనితో ఆస్ట్రియా జర్మనీ ఆస్ట్రియా అయింది. హిట్లర్ వియన్నా ప్రవేశించి ఉపన్యసించాడు. ఫ్రాన్సు, ఇంగ్లండులు అసమ్మతికి సమాధానం చెబుతూ హిట్లర్ వారికొకప్రశ్న వేశాడు.

"20 ఏండ్ల క్రిందట మీ రాజనీతి ఏమి తగుల బడింది? విల్సన్ సూచనలకు బ్రిటన్ ఎందుకు పెడమొగం పెట్టింది." ఈ ప్రశ్నలో సబబున్నది. మళ్ళా ఆయా దేశాలకు స్వాతంత్ర్యం ఇవ్వమని విల్సన్ ఘోషించాడు. కాని ఎవరూ వినలేదు. కాని ఇతర సామ్రాజ్యాలు జర్మనీకి చేసిన ద్రోహం కంటె, జర్మనీ తన దేశంలో కార్మిక కర్షకులకూ — ప్రపంచ శాంతికి చేసిన ద్రోహం, చేయబోయే ద్రోహం పెద్దది. మరువరానిది.

ఏమీ రక్తపాతం లేకుండా ఆస్ట్రియాను జయించామని నాజీలు చంకలు కొడు తున్నారు. కాని నాజీ చరిత్ర తెలిసిన—ఫాసిస్టు తత్వం తెలిసిన-వాళ్లు, ఇకముందు ఆస్ట్రియాలో ఎంత రక్తపాతం జరుగు తుందో ఊహించగలరు.

★

ఈలొంగుబాటుకు డోల్ఫస్ 1934 లో కార్మికులను చిత్రవధచేసి చేసిన ద్రోహమే గాకుండా ఈనాడు షూషినిగ్ పిరికితనం-ద్రోహం కూడా సహాయపడింది.

షూషినిగ్ మొదట హిట్లరుతో సంధి చేసికోవడం తప్పు. రెండవది నాజీ పార్టీపై నిషేధం తొలగించడం. మూడ వది కార్మికులకు పూర్ణ స్వాతంత్ర్యం ఈయక పోవడం. శత్రువులను క్రూరంగా అణచక లంచాలు పెడుతూ వుంటే అణగుతారా? అయితే హిట్ల రుతో యుద్ధానికి తలపడితే ఆస్ట్రియా బ్రతుకుతుందా అనవచ్చు. కాని ఈనాడు జరిగిందేమున్నది? వీరుల్లాగ యుద్ధం చేస్తే స్పెయిన్—చైనా స్థితియే సంభవిం చినా ప్రపంచ సానుభూతి ఉండేది. హిట్లరు పరిస్థితులు బలపడేవి కావు. స్పైన్ పరిస్థితులూ కొంచెం బాగుపడేవి. హిట్లరుకు కలిగే ఇబ్బందులవల్ల ముందు సాగింపబోయే దాడి తగ్గిపోయేది. ఈనాడు అశ్రుపూరితుడై, గద్గద కంఠంతో "అయ్యో! నా దేశీయు లారా!" అని షూషినిగ్ ఏడ్చినా లాభం ఏమిటి?

జర్మనీకి ఆస్ట్రియా వశం గావడం లిటిల్ ఎంటిటీస్‌కు—ముఖ్యంగా జకోస్లో కేవియాకు భయం ఉంది. జకోస్లోకే వియాలో కూడ 35 లక్షల జర్మను లున్నారు. హిట్లర్ దాడిచేస్తే ఆస్ట్రియాలాగ ఊరక జకోస్లోకేవియా లొంగదు. పోరాడు తుంది. కాని దానికి ఫ్రాంసు, రష్యాల సహకారాన్ని బట్టి ఉంటుంది ఎదిరించే బలాబలం....

ఈనాటికి ఆస్ట్రియా వశం గావడంతో హిట్లర్ కోరిక సిద్ధించింది. 1924 లోనే "మైన్ కాంఫ్" అనే పుస్తకంలో హిట్లర్ ఇలా వ్రాశాడు. "నేను యువకుడిగా నున్నప్పటినుండి జర్మనీజాతి రక్షణానికి —ఆస్ట్రియా నాశనం తప్పదని తలచాను. [illegible] నంత రీచ్ క్రిందకు రావాలి."

నవశక్తి

16—3—38 బుధవారము

అతివాద మితవాద సమ్మేళనము

ఆలిండియా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ కార్యదర్శి కామ్రేడ్ జయప్రకాశ నారాయణ హరిపురా కాంగ్రెసు సందేశాన్ని గూర్చి వ్రాయుచూ సామ్యవాదుల యొక్క వైఖరిని చక్కగా వ్యక్తీకరించినాడు. ఆత్మపరీక్షతో నిండి యున్న దాయన వ్యాసము. సామ్యవాదులకు వారొసంగిన సలహాకూడ చక్కగా నున్నది. పార్లమెంటరీ కార్యక్రమము పట్ల మంత్రుల యెడ సామ్యవాదుల వైఖరిని స్పష్టీకరించినాడు. సామ్యవాదమునకును గాంధివాదమునకును భేదము హాస్తిమశకాంతరమైనను సంపూర్ణ స్వాతంత్ర్య సిద్ధికై చేతులు కలిపి పోరాడుటకు చాల అవకాశములు కలవని నొక్కి వక్కాణించినాడు. మొత్తము మీద తీర్మానాలను, ప్రణాళికలనుబట్టి చూస్తే కాంగ్రెసు మహాసభ మితవాదం కంటె అతివాదాన్నే యెక్కువ సూచిస్తుందని తెలవిచ్చాడు. అమూల్యములైన యీ వచనములలో మేము పూర్తిగా యేకీభవిస్తున్నాము. మంత్రివర్గముల పట్ల వైఖరిని గూర్చి అతని యీ క్రిందిమాటలు గమనింపదగినవి.

"మంత్రివర్గ నిర్మాణములకు మేము వ్యతిరేకులుగా నుంటిమి. కాని యెప్పుడైతే అవి నిర్మాణమైనాయో అప్పటినుంచి సదరు మంత్రివర్గాలు కాంగ్రెసు కార్యక్రమాన్ని అమలు జరుపాలని మేము కోరుచున్నాము. ఆ కార్యంలో కాంగ్రెసు వాదులమగు మేము వారికి సాయపడతాము. ముఖ్యంగా మంత్రివర్గాలు కాంగ్రెసు మహాసంస్థను, జాతీయోద్యమాన్ని బాగుగా బలపరచే సాధనాలుగా ఉండాలని మా కోరిక."

దాదాపుగా యిదే మాటలలో నిరూపించినాము 'నవశక్తి' యొక్క ఆశయాన్ని ప్రథమ సంచికలో. నిజంగా అతివాదులు, మితవాదులు కాంగ్రెసు ఎన్నికల కరపత్రాన్ని ప్రమాణంగా గైకొని పార్లమెంటరీ కార్యక్రమాన్ని నడిపిస్తే భేదభావాలకు తావుండదు. ఐక్యసంఘటనకు పునాదిగా కాంగ్రెసు యెన్నికల ప్రణాళికను సామ్యవాదు లంగీకరించుటకు సదా సిద్ధంగానే ఉన్నారు. అట్టిచో యీ విషయమై సంఘర్షణ మెందులకు రావలెనను ప్రశ్న బయలు దేరును. పరస్పర అనుమానాలు ఎందుకుండవలెనని అడుగ వచ్చును. మంత్రివర్గాల పడగొట్టుటయే సామ్యవాదుల పరమావధి యని గాంధీవాదుల అనుమానము. కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికను మాటలలోనే గాని క్రియలలో సరిగా ఆచరించుటలేదని సామ్యవాదుల సంశయము. రాజకీయఖైదీల విడుదలలో మంత్రివర్గాల మందగమనము, రాజద్రోహ సెక్షను ప్రయోగములో మంత్రివర్గాల తొందరపాటు, సమ్మెలు దౌర్జన్య పూరితములని మంత్రుల భ్రాంతి, ఆదాయ వ్యయపట్టికలలో కార్మికులకు కర్షకులకు తగినంత ప్రాధాన్యత యివ్వక పోవుట, మున్నగునవి సామ్యవాదులకు సహజముగా ఆగ్రహ కారణములైనవి. ముఖ్యంగా కాంగ్రెసు రాష్ట్రాలలో సైతము నిర్బంధములకు పాల్పడినవారు సామ్యవాదులే గనుక భేదభావము మరింత హెచ్చినది. శత్రువులవలె సామ్యవాదులను రైతుసేవకులను గాంధీవాదులు పరిగణించి వారిని అణచివేయుటకు తమ యధికారమును దుర్వినియోగ పరచుటచే పరిస్థితులు మరింత విషమించినవి. హరిపుర కాంగ్రెసులో సామ్యవాదులు సంపూర్ణ సహకారమును జూపినను బుల్లాభాయి, వల్లభభాయిల కోపము చల్లారలేదు. మంత్రుల రాజీనామాలు అతివాదుల ఒత్తిడివల్ల త్వరితగతిని పొందెనను సుభాష-జయప్రకాశ గారన్నటుల, స్పష్టముగ హరిపురములో కనపడెను. అతివాద విభేదాలు నమసిపోవలెనని అందరు అంగీకరిస్తారు. కాని అదెట్లు సాధ్యము?

ముఖ్యంగా కాంగ్రెసు ఎన్నికలలో సామ్యవాదులను అణచివేయుటకు అన్ని రాష్ట్రాలలోను అధికార వర్గమున నున్న మితవాదులు అన్ని విధములా ప్రయత్నించిరి. ఆంధ్రరాష్ట్రము అందు అగ్రస్థానము వహించెను. బీహార్ రాష్ట్రమున రైతు సేవకులపై బహిరంగముగా దాడి కొనసాగుచున్నది.

ఆంధ్రదేశమున నిజముగా అతివాద, మితవాద విభేదము కొత్తపట్నం విషయమున ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు వర్కింగు కమిటీవారు చూపిన వైఖరితో ప్రారంభమైనది. కాంగ్రెసు ప్రతినిధుల యెన్నికలలో తీవ్రరూపము దాల్చినది. ఇప్పుడు జరుగనున్న జిల్లా కాంగ్రెసు యెన్నికలలో యిదే భావము వ్యక్తమగుచున్నది. ఖద్దరు కట్టుకోరను నెపమున సోషలిస్టులను త్రోసివేయుచున్నారు.

అయితే యిప్పుడు కొన్ని ఆశాకిరణములు గూడ గన్పించుచున్నవి. ఏవో కొద్దిమార్పులు మాత్రం జేసి పశ్చిమ గోదావరిజిల్లా వర్కింగు కమిటీవారు చేసిన నియోజక వర్గాల యేర్పాటును పట్టాభిగారు అంగీకరించినారన్న సామ్యవాదులు వర్కింగుకమిటీ తమచేతులలో నున్నదను దురహంకారమును చూపక న్యాయముగ వ్యవహరించినారని యర్థము. పట్టాభిగారు ఇదే భావముతో యితర జిల్లాలలో కూడ వ్యవహరించిన యెడల ఆంధ్రదేశమున అతివాద మితవాద సమ్మేళనమున కెక్కుడు అవకాశముండునని సూచించుచున్నాము. చీరాల కాల్పులు వ్యవహారంలో గుంటూరు జిల్లా కాంగ్రెసువాదులు; సోషలిస్టులు ఏకమై పని చేయుచున్నారు. అట్టి సుహృద్భావమే ఆంధ్రదేశమంతట వ్యక్తము కావలెనని కోరుచున్నాము. పట్టాభిగారీ ఐక్యవిధాన కార్యక్రమమునకై పూనుకొందురుగాక యని కోరుచున్నాము. కాంగ్రెసు యెన్నికల ప్రణాళికలోని ముఖ్యాంశములు తీసికొని వాటిని మంత్రివర్గాలు అమలు జరుపునట్లు చూడవలయును. ఆంధ్రదేశమున యీ క్రింది కార్యక్రమముపై ఐక్యసంఘటనను సాగింపవచ్చునని సూచించుచున్నాము.

(1) ఆంధ్రరాష్ట్రనిర్మాణము వెంటనే జరగాలి.

(2) రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల చెయ్యాలి. ఊటీబ్యాంకి ఖైదీలు అయిదుగురింకా జైళ్ళలో మగ్గుచున్నారు. వారిని వెంటనే విడుదల చేయించాలి.

(3) బాట్లీవాలా శిక్షను రద్దు చెయ్యాలి.

(4) కార్మికులకు 8 గంటల పని, తగినంత కూలి మున్నగు సౌకర్యాలు కలుగజేయు శాసనాలను ప్యాసు చేయించాలి.

(5) ప్రస్తుత ఋణనివారణ బిల్లుతోపాటు వ్యవసాయ కూలీలకు ఉపయోగించు ఋణ నివారణ బిల్లును కూడ ప్యాసు చేయించాలి.

(6) కార్మిక సంఘాలు, రైతు సంఘాలు గుర్తింపబడాలి.

(7) ఎస్టేటు లాండు ఆక్టును రైతు కనుకూలంగా సవరించే చట్టాన్ని ప్యాసు చేయించాలి.

(8) కొత్తపట్నం స్కూలుపై నిషేధం తొలగించాలి.

(9) ఉద్యోగులలో లంచగొండితనం రూపుమాపాలి.

(10) విద్యార్థులు రాజకీయాలలో పాల్గొనరాదను ఆంక్షను తొలగించాలి.

(11) సి. ఐ. డి లను కాంగ్రెసు వారల వెంట తగిలించుట మీటింగులకు వచ్చి రిపోర్టులు వ్రాయించుకొనే పద్ధతిని రద్దుచేయాలి.

(12) వాలంటీరు దళాన్ని వెంటనే యేర్పాటు చెయ్యాలి.

వీటి కింకా కొన్నింటిని చేర్చవచ్చు. ఈ ప్రణాళికపై సామ్యవాదులు చేతులు కలిపి పనిచేయుటకు సిద్ధముగా నున్నారని వెల్లడించుచున్నాము.

డాక్టరు పట్టాభిగారు వెంటనే యీ కార్యక్రమమునకు పూనుకొందురని ఆశించుచున్నాము.

పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెసు ఎన్నికలు

ఎన్నికోద్యోగిగారిపై ఆక్షేపణలు

మా జిల్లాకు శ్రీయుత కొమ్మారెడ్డి ఆంజనేయులుగారిని ఎన్నికోద్యోగిగా నియమించారు. ఆ పదవి వచ్చింది లగాయతు శ్రీ ఆంజనేయులుగారి ప్రవర్తన పరిశీలిస్తే ముఖ్యంగా నామినేషన్ల స్క్రూటినీ చూస్తే తమ పార్టీ వారు రావడం కోసం ఎన్ని అన్యాయాలు చేసి అధికార దుర్వినియోగం చేస్తున్నారో బోధపడుతుంది.

ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘంవారు, జిల్లా వర్కింగు కమిటీలు చేసిన నియోజక వర్గాలు సరిచూసి ఆక్షేపణలు తీసుకొని న్యాయమైన మార్పులు చేయడం కోసం ప్రతి జిల్లాకు ఒక్కొక్క కమిటీని నియోగించారు. మా జిల్లాకు అలా నియోగింపబడినవారు (1) జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణగారు, (2) జిల్లా ఎన్నికోద్యోగి ఆంజనేయులుగారు, (3) ముదిగంటి జగ్గన్నశాస్త్రిగారు. యీ కమిటీ ఈ నెల 1 వ తేదీన ఏలూరులో సమావేశమైంది. దానికి అల్లూరి సత్యనారాయణగారు ఆరోగ్య పరిస్థితులు బాగులేక రాలేదు. యింక మిగతావారిద్దరు కూర్చొని వారి పార్టీ క్యాండిడేట్లు వచ్చేటందుకు వీలుగా వుండేలాగ యిష్టం వచ్చిన మార్పులు చేసి రాష్ట్ర సంఘానికి జగ్గన్నశాస్త్రిగారు స్వయంగా తీసుకొని వెళ్ళారు. ఆ మార్పులు నోటీసు బోర్డులో పెట్టి ప్రకటించమని కొందరు అడిగితే "అల్లా చెయ్యవలసినదిగా మాకు రాష్ట్ర సంఘంనుండి ఆర్డరు ఏమీ లేదు. మేము ప్రకటించ" మన్నారు ఆంజనేయులుగారు. ఆఫీసుకు ఒక కాపీ యిమ్మని అడిగినా కూడా వీల్లేదన్నారు. యీ సంగతి తెలిసి అల్లూరి సత్యనారాయణగారు జిల్లాపటంతీసుకొని పట్టాభిగారి వద్దకు వెళ్ళి పటం దగ్గర పెట్టి ఇదివరకు జిల్లా వర్కింగు కమిటీవారు చేసినవి యిప్పుడు ఎన్నికోద్యోగిగారు జగ్గన్నశాస్త్రిగారు కలసి చేసిన మార్పులు చూపారు. పట్టాభిగారికి వీరు చేసిన అన్యాయం స్పష్టంగా కనపడి వుండాలి! ఏమయితే నేమి! వర్కింగు కమిటీవారు చేసినవే సక్రమంగా వున్నాయని ఖాయపరిచారు. కొద్ది అవసర మార్పులతో పట్టాభిగారిట్లు న్యాయముగా వ్యవహరించుటచే ఆంజనేయులు ప్రభృతులకు తీరని ఆశాభంగం కల్గింది.

ఆంజనేయులుగారు మహజర్లు పెట్టుకున్నా వారు వాటిని గమనించలేదు. నామినేషన్లు తీసుకోడానికి నిర్ణయించిన టైము అయిపోయేవరకు వచ్చిన నామినేషన్లు కాక, కొన్ని కొత్తగా సృష్టింపబడ్డాయి. ఏలూరు వచ్చే సరికావిధంగా కొవ్వూరు తాలూకా నామినేషన్లు రెండు మూడు పిల్లల్ని పెట్టాయి. యిది చూసి, కొవ్వూరు తాలూకా కాంగ్రెస్ సంఘాధ్యక్షులు గరా రఘునాయకులుగారు సెక్రటరీ అడ్డాద అరవాలునారు రెబ్బాప్రగడ మందేశ్వరశర్మగారు వగైరాలు ఆంజనేయులుగారికి "బాబూ యిప్పుడు నామినేషను ఫారాలే పిల్లల్ని పెడుతుంటే రేపు బ్యాలెట్ పెట్టెలలోని ఓట్లెన్ని పిల్లల్ని పెడతాయో మాకు భయంగా వుంది. వీరిని మార్చవలసిన"దని వ్రాతమూలకమైన అర్జీలు దాఖలు చేసుకున్నారు. ఈపిటీషన్లు వారికి లెక్కేమిటి? మొండివాడు రాజుకన్న బలవంతుడు!

మొట్టమొదట చింతలపూడి తాలూకాతో ప్రారంభించారు. ఖద్దరు కట్టువాడా కాడా అనే ప్రశ్న వచ్చినప్పుడు తాలూకా కాంగ్రెస్ కార్యదర్శి చెప్పిన సాక్ష్యము ననుసరించి స్క్రూటినీ గావించారు. అది కొంతవరకు సక్రమమే, కాని దాని తరువాత భీమవరం తాలూకా వచ్చేసరికా పద్ధతి మారిపోయింది. అన్నట్టు ఇంకో ముఖ్యమైన విషయం చెప్పడం మరిచాను. ప్రతీ తాలూకాకు స్క్రూటినీ కూర్చోక, పూర్వం తమ పార్టీవారంతా రహస్యంగా సమావేశం కావడం ఆ తాలూకాకు ఏ పద్ధతి అవలబించాలో ఏ యే నామినేషన్లు త్రోసివేయాలో నిర్ణయించుకోవడం తరువాత ఆఫీసులో ఆంజనేయులుగారు ఆ నిర్ణయాలన్నీ అక్షరాలా అమలు జరపడం ఇది ప్రతి తాలూకాకు వారవలంభించిన తంతు.

ఈ తాలూకాలోనే ఇంకా ఒకటి రెండు చిత్రాలు చెప్పి యింకో తాలూకాకు పోతాను. చెరుకుమిల్లి నియోజకవర్గానికి ఒకాయన నామినేషను పడవేశాడు. ఆయన చెరుకుమిల్లి గ్రామ కాంగ్రెసు సభ్యుడును సభ్యుడుగానున్న కాంగ్రెసుసంఘం అనే చోట చెరుకుమిల్లి అని వ్రాశాడు. దానిక్రిందనే వున్న నియోజకవర్గం అనుచోట "చెరు" అని మాత్రమే వ్రాసి వదలేశాడు. పూర్తిగా వ్రాయలేదు కనక ఆయన నామినేషను రద్దు. (సోషలిస్టు అయ్యాడు) ఆయన మీద ఇంకేవిధమైన ఆక్షేపణలు లేవు. అదికాక ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరచిన వారిద్దరుకూడా ఆ నియోజకవర్గంలోనివారే అయినా గాని ఎలెక్షను ఆఫీసరుగారికి సక్రమంగా తోచలేదు. ఇంకో విషయం. అదే తాలూకాలో రాయిలం, పెదమిరం, మొదలగు నాలుగైదు గ్రామాలు కలసి రాయిలం సర్కిల్ అనే పేరుతో వున్నాయి. ఒకాయన పాపం నియోజకవర్గానికి ఎదురుగా పెదమిరం అని వ్రాశాడు. అందుకని ఆయన నామినేషను రద్దుచేశారు. ఇటువంటి కేసు నర్సాపురంతాలూకాలోకూడ ఒకటి వచ్చింది. చిక్కాల, దగ్గులూరు, బల్లిపాడు అనే గ్రామాలు కలిసి చిక్కాల సర్కిల్ అనే పేరుతో వున్నాయి. అక్కడకూడా ఒకాయన నియోజకవర్గానికెదురుగా చిక్కాల అని వ్రాయడానికి బదులు దగ్గులూరు అని వ్రాశాడు అవూరుకూడా ఆ నియోజకవర్గంలోనిదే కనక ఆ నామినేషను చెల్లుతుందన్నారు ఆంజనేయులుగారు. ఇంతకు ఆ నామినేషను పడవేసిన ఆయన తన పక్షంవాడు కనుక అది చెల్లింది. ఈరూలుపైన చెప్మిన పెదమిరం అని వ్రాసినదానికి ఎందుకు వర్తించదో ఆవాయుపుత్రుడికే ఎరుక!!

ఇంక ఏలూరు తాలూకా చూద్దాం. యీ తాలూకాలో దెందులూరు సర్కిలుకు తమ పార్టీవారు కాబోయే జిల్లా కాంగ్రెసు కమిటీ కార్యదర్శి (ఆంజనేయులు పార్టీవారు అధ్యక్షులైతే) అయిన కొమ్మారెడ్డి సూర్యనారాయణగారు కూడా ఒక అభ్యర్థి. దానికే కొల్లిపర గోపాలం అనే ఆయన కూడా దరఖాస్తు చేశాడు. ఆయన నామినేషను నిలిస్తే సూర్యనారాయణగారు నెగ్గడం కష్టం. అందుకని ఆయన, 1930 నుండి నిత్య ఖద్దరుధారి అయినప్పటికీ కూడా ఒక విదేశీ బట్టలు కట్టుకునే ఆయన—అంటే సూర్యనారాయణగారి పక్షంవాడు—వచ్చి గోపాలంగారు ఎన్నడూ ఖద్దరు కట్టడు అని సాక్ష్యం యివ్వడం. దానిని బట్టి గోపాలంగారి నామినేషను త్రోసివేయడం జరిగాయి.

ఈ గోపాలంగారు సోషలిస్టు కాకపోయినా ఆంజనేయులుగారికి తన ఓటు యిస్తానని ముందుగా వాగ్దానం చేయలేదుట.

ఇక నర్సాపురం తాలూకా వచ్చేసరికి వారి ధోరణి వర్ణనాతీతంగా మారిపోయింది. వరిధనం సర్కిలుకు విశాల సుబ్బారావుగారు, రాయిప్రు బాపిరాజుగారు నామినేషన్లు పడవేశారు. దీనికో చిత్రమైన యితివృత్తం వుంది. సుబ్బారావుగారు తమ నామినేషను బలపరిచే వారిచేత 6 వ తేదీనే జిల్లా స్థానానికి నిలబడుతున్నానని చెప్పి నామినేషను 10 వ తేదీ ఉదయం 9 గం॥ సంతకములు చేయించుకుని దాఖలు చేశారు. పదవ తేదీ సాయంకాలం వరకు సోదరుడు బాపిరాజుగారికి జిల్లాలో ఎక్కడా స్థానం కనపడలేదు. సుబ్బారావుగారి నామినేషను రద్దు చేయించి తాను వరిధనం సర్కిలునుండి పోటీలేకుండా రావలయునని ఎత్తు వేశారు. అనాడు(10 వ తేదీ నామినేషన్లు టైము ఆఖరు అయ్యేరోజు) సాయంకాలం 4 1/2 గంటలకు సుబ్బారావుగారి నామినేషను ఫారం మీద బలపరుస్తూ సంతకం చేసిన ఒకాయన వద్దకు వెళ్ళి బాపిరాజుగారి నామినేషను ఫారం మీద కూడా సంతకం చెయ్యమని పంపారు. ఆయన అట్లు చేస్తే తాను ముందుగా చేసిన సుబ్బారావుగారి నామినేషను రద్దు అవుతుంది గాన చెయ్యనని నిరాకరించాడు. అది జిల్లా స్థానానికి ఇది తాలూకా స్థానానికని అట్లు చేయవచ్చునని చెప్పి మభ్యపెట్టి సంతకం చేయించుకుని, ఆ నామినేషను ఫారం మీద జిల్లా స్థానమునకు అని పూర్తి చేసి, సాయంత్రం 5 గం॥ దాఖలు చేసి, ఆఫీసులో వున్న మేడూరి ప్రకాశరావుగారి చేత ఉదయం 7 గం॥ దాఖలు కాబడినట్లు టైము వేయించారు. తరువాత యీ సంగతి తెలిసి ఆ సంతకం చేసిన ఆయన ఏలూరు వచ్చి జిల్లా ఎలెక్షను ఆఫీసరుగారివద్ద జరిగిన మోసమంతా వ్రాతమూలకమైన అఫిడవిట్టు రూపంగా దాఖలు చేసి చెప్పుకున్నాడు. బాపిరాజుగారి నామినేషను దాఖలు కాబడినప్పుడు ఆఫీసులో వున్న నర్సాపురం తాలూకా కాంగ్రెసు సెక్రటరీ కూడా ఆ నామినేషను ఉదయం దాఖలు కాబడలేదనిన్ని సాయంత్రం దాఖలు చేయబడినదనీ స్టేటుమెంటు యిచ్చాడు. అది వరకే వారి క్యాబినెట్ మీటింగులో నిశ్చయించుకున్నదే కనుక యివి ఏమీ లెక్క చేయకుండా సుబ్బారావుగారి నామినేషను రద్దు చేసి బాపిరాజుగారు పోటీ లేకుండ ఎన్నుకోబడ్డట్లు ప్రకటించారు.

ఇదంతా ఎందుకు ఆంజనేయులుగారికి వారి పార్టీవారికి, నేను ఒక్కటే సవాలు చేస్తాను, తమకుగాని, తమ పార్టీవారికి గాని, ప్రజలలో పలుకుబడి వుంటే బహిరంగంగా పోటీ చేసి నెగ్గి మెజారిటీ సంపాదించి ఆఫీసును వశపర్చుకోవాలి. అంతేగాని ప్రత్యర్థుల నామినేషన్లు త్రోసివేసి తమ పార్టీవారిని తప్పించుకో చూడడం పురుష లక్షణం కాదు.... (ఒకవిలేఖరి)

పల్లంరాజుగారు అబద్ధమాడేరా?

మహారాజ శ్రీ పల్లిపూడి పళ్ళంరాజు గారికి కొవ్వూరు తాలూకా వీరవాసరం దేవరపల్లి యనములూరు సర్పిప్రాయు బహిరంగలేఖ

నేనీదిగువ వ్రాసిన విషయములకు తాము వైర్యముతో బహిరంగముగ జవాబుల నిచ్చెదరని కోరుచున్నాను.

1 నన్ను తమరు తుని తాలూకా కాంగ్రెసు కమిటీకి సభ్యునిగా నామినేటు చేసినపుడు (అనగా వర్కింగు కమిటీ మెంబరుగా) నేను శుద్ధ ఖద్దరుదారుడనని పూర్ణ విశ్వాసము కలిగియున్నారంటారా? లేదా

2. నన్ను అయ్యపరాజు కొత్తపల్లి నియోజకవర్గముకు పోలింగు ఆఫీసరుగా వేయడం అబద్ధమంటారా? అప్పుడు నిత్య ఖద్దరు దారుడని యెరుగరా?

3. తూ॥ గో॥ జిల్లా రాజకీయ మహాసభకు తుని తా॥ కాం॥ క॥ వారు డెలిగేటుగా పంపినపుడు నన్ను నిత్య ఖద్దరు దారుననియేనా?

4. మ. రా. శ్రీ కంభంపాటి సత్యనారాయణ గారిని నిత్య ఖద్దరుదారు కాదని నాచే అబ్జక్షను పిటీషను వ్రాసి దాఖలు చేయుటలో తా ఉద్దేశ్య మేమి? నేను (కాం॥ క॥ (వర్కింగు కమిటీ మెంబరని తుని తా॥ కాం॥ క॥ వారికి తెలిసి కూ? తెలియకయా?

5. తమరు యీ స్వల్ప విషయములో అబద్ధ మాడుటకు తగిన కారణ మేమి?

దయతో పత్రికాముఖముగనూ, నాకునూ గూడ తెలుప ప్రార్థించుచున్నాను.

చిత్తగించవలెను. బా॥ వీరవాసరపు దేవరపల్లి వ్రాయు.

చీరాలలో గిజర్వుదళం దేనికి?

(12 వ పేజీ తరువాయి)

జరిగిన 15 రోజులకు ఈ అరెస్టులు జరిగినై అంటే దానిలోని అంతరార్థం ప్రజలే వూహించుకోవాలి. అరెస్టయిన వాళ్ళసంఖ్య 38. అందులో ముగ్గురు స్త్రీలుకూడా వున్నారు. ఈ విధంగా అరెస్టులు చేయటంలో రెండు రకాలుగా వుపయోగాలు వుంటాయని వేసినయెత్తు. 1 తాముచేసిన తప్పును సమర్థించు కోచూడటం. 2 అరెస్టయినవాళ్ళు యూనియన్ తరపున సాక్ష్యం ఇవ్వటానికి వీలు లేకుండా చేయడం.(వీరిలో చాలా మంది కాల్పులు జరుగుతుండగా చూచి యూనియనుకు వాగ్మూలాలు ఇచ్చినవారు కలరు) ఈ విధంగా బహిరంగ విచారణజరగబోయే ముందు అరెస్టులు చేయడం న్యాయానికి విరుద్ధం. ఇందువల్ల చాలా మంది కార్మికులు సాక్ష్యం చెప్పటానికి వీలు లేకుండా పోయింది. ఈ అరెస్టులవల్ల మిగతా కూలీలు కూడా సాక్ష్యంచెప్పితే యేమి తంటావస్తుందో నని భయపడుతున్నారు. అధికారులు కూలీలు సాక్ష్యం చెప్పకుండా భయపెట్టాలని కూడా ఈ పనిచేసి వుండవచ్చు. ఇప్పుడు వాళ్ళందరిపైనా వేషాలు వేసుకొనికూలీల గుడిసెలకు తిరిగి. "యూనియన్ తరపున సాక్ష్యం చెప్పవద్దని చెప్పితే మీకుముందు చాలాకష్టాలొస్తాయని" బెదరింపుతూ రాత్రిళ్ళు ప్రచారం చేస్తున్నట్లు మాకు అనేకమంది కూలీలు చెప్పుతున్నారు. ఈ విధంగా రకరకాలుగా పోలీసులు అధికారులు నాటకాలు ఆడుతున్నారంటే బహిరంగ విచారణకూడా నిష్ప్రయోజన మేమో అనిపిస్తున్నది. పోలీసులు బెదరింపు ప్రచారాలతోను, రిజర్వుపోలీసుల సైనిక ప్రదర్శనాలతోను, అరెస్టులతోను అధికారులు ఒక తంతు జరుపుతూ కూలీలను భయపెడుతూ వుంటేఈ బహిరంగ విచారణవల్ల యేమైనాలాభముందా? అనిసందేహించాలసి వస్తున్నది అరెస్టుల వల్ల చాలామంది సాక్ష్యాలు చెప్పటానికి వీలు లేకపోయిందని.కూలీలపైన పెట్టిన కేసులు వుపసంహరించు కోమని కార్మిక సంఘంవారు, పురజనులు కాంగ్రెసు మంత్రులకు విన్నవించుకొన్నారు. కాని ఫలితం శూన్యం. కాంగ్రెసు మంత్రులు ఒక ప్రకటన చేశారు. సాక్ష్యం ఇవ్వదలచు కొన్నవారు నిర్భయంగా ఇవ్వవచ్చునని. సాక్ష్యలిచ్చినవారిపైనయెట్టిచర్యలు జరుపబడవనిఅభయహస్తమిచ్చారు. మంచిదేగాని అది చాలదు. చీరాలలో జరిగే తంతు బట్టిచూస్తే ఆ అభయ హస్తంవల్లయేమీ లాభం లేదని తోస్తుంది. హార్విల్‌గారు చీరాలలోని కూలీల గుడిసెలవద్దకు చూడటానికి వచ్చినప్పుడు షేక్ మౌలానాయనే కూలి ఆనాడు పోలీసులు చేసిన దుండగాలను గురించి ఆ ప్రదేశాలన్ని చూపిస్తూ వూసగ్రుచ్చినట్లుగా చెప్పాడు హార్విలుగారితో. హార్విలుగారు అంతా సావధానంగా విని "ఇదంతా కోర్టుకొచ్చి సాక్ష్యం చెప్పరాదా?" అని అడిగితే బాబూ యేపాపం యెరగనివాళ్ళనే పోలీసాళ్లు బావగొట్టి చెవులు మూస్తుంటే కోర్టుకొచ్చి చెప్పితే మా ప్రాణాలు పోవా అన్నాడు దీనంగా. ఇంట్లో కూర్చొన్న ఆడవాళ్ళను యేవిధంగా లాఠీలతో బాదారో అదంతా చెప్పుకొన్నారు ఆడవాళ్ళు. చీరాలలో పోలీసులు చేసిన అత్యాచారాలకు బెదరింపులకు భయపడి సాక్ష్యం ఇవ్వటానికి భయపడుతున్నారు కూలీలు. ప్రజలపైన పోలీసులు అధికారులయొక్క జుల్మ్ ఇంత నిరంకుశంగా సాగుతుంటే మన రాజగోపాలాచారి గారు "మేం మంత్రులమైనాం గాబట్టి క్రింది అధికారుల స్వభావాలు కూడా మారిపోయినై గనుక ఇదివరకు వలె మీరు వారిని విమర్శించకూడదు. వారు చేసే పనులన్ని మా అనుమతి మీదనే నని గుర్తించాలి" అని ఒకసారి సెలవిచ్చారు. పాపం ఆయన మంత్రి కాగానే క్రింది అధికారు అంతా కాంగ్రెసువారు అయినారని 'హృదయ పరివర్తన' కలిగిందని కామోలు ఆయన వుద్దేశం. బహుశ వీరంతా మంత్రిగారి ముందు చేతులు ముడుచుకొని వినమ్రులై సత్యమూర్తుల్లా వింటారేమో గాని ప్రజల దృష్టిలో మాత్రము కాదని ప్రధాన మంత్రి గారికి మనవి చేస్తున్నాం. కనుక చీరాల దురంతాల విషయమై బహిరంగ విచారణ న్యాయంగా జరగాలంటే (1) అచ్చట ప్రదర్శనం చేస్తూ ప్రజా శాంతికి భంగం కలిగిస్తూ అనవసరంగా వున్న రిజర్వు పోలీసు దళాన్ని వెంటనే తీసివేయించాలి. (2) రూధర్‌ఫర్డును తొలగించి, మరొకరిని విచారణకర్తగా నియమిస్తారనగానే కాల్పులయిన 15 రోజులకు అరెస్టు చేసిన 38 మంది కార్మికులను, వారిపై కేసులను వుపసంహరించుకొని వారిని వెంటనే విడుదల చెయ్యాలి. (3) అరెస్టయినవారు ఇవ్వబోయే సాక్ష్యల్ని కూడా అంగీకరించాలి. పైపనులు వెంటనే చేయనిదే ప్రభుత్వము వారు చేసిన ప్రకటన వల్ల యేమాత్రము ప్రయోజనముండదు. ఈ అరెస్టుల వల్లను పోలీసు కావలా వల్లనే కూలీలు భయపడుతున్నారు. కనుక ఆ రెండు భయాలు పోనిదే కూలీలకు సరియైన న్యాయము కలుగదని మా వుద్దేశం. అరెస్టయిన వారిని విడుదల చేయుటకు ప్రభుత్వమువారు సమ్మతించలేదని కూడా యూనియన్‌వారు చేసిన ప్రకటనలో వున్నది. అందుకు మాత్రం చాలా విచారం. కాంగ్రెసు ప్రభుత్వంవారు మరియొకమాటు విచారించుకొని, కూలీల భయమును కలిగించిన ఆ రెండు పనులను మాన్పించవలయునని కాంగ్రెసు మంత్రులను కోరుతున్నాం.

కాలేజీ ప్రిన్సిపాల్ గారికి రెండవ లేఖ

(6 వ పేజీ తరువాయి)

మరచి, వారిని తిట్టి వారికొక గ్యాంగు నంటకట్టడంలో మీ ఉద్దేశ్యంఏమిటి? గ్యాంగులో ఎవరున్నారు? ఉన్న కోపాన్ని వెళ్ళబుచ్చారు మీరు అంతే కాని న్యాయాన్యాయ వివక్షణ నశించింది. దీన్ని మరోసారి ఆలోచించండి. ఎక్సెల్సియర్ కార్యదర్శుల రిపోర్టు, జరిగిన విషయాలతో నిండిన వారి వ్యక్తిగతోద్దేశం వాటిని బలవంతముగా మార్పించి వాటినే చదవాలి అనడంలో మీ నియంతృత్వం బయటపడడంలేదేమో ఆలోచించండి.

ఇక రసాయన శాలలో గాని, విజ్ఞాన శాస్త్రశాలలలోఏమైన వస్తువులు పోతే, ఎవరు తీశారో విచారించారని చెప్పగలరా? మీరుక్లాసులకు అకాలంలో వచ్చి ఏదోచెప్పుతూ, చివరకు పాఠాలు పూర్తవకపోతే రాత్రిపూట 10 గంటలవరకూ ప్రయివేటు క్లాసును పెట్టడం న్యాయమేనా? ఉపాధ్యాయులు విద్యార్థుల్ని పశువులులాగ చూస్తున్నారుగాని, మానవులులాగ చూస్తున్నారేమో విచారించండి. ఎవరోవిద్యార్థిమాటల సందర్భంలో "వైసుఛాన్సలరుగా రొస్తేనాకేమి ప్రిన్సిపాలుగారికేగాని" అనేదో అన్నారని అతనిని పిలిపించి అతను నే నెరుగ నని మొత్తుకున్నా వినక తిట్టారట నిజమేనా? ఈ అల్లరిమీ కెందుకు చెప్పండి? విద్యార్థుల్నిలా ఏడ్పించుకు తినడం ఉభయులకూ మంచిది గాదు. వారి హక్కుల్ని గమనించండి. హాస్టలు విషయాలూ, కాలేజీ విషయాలు, ఆశ్చర్యాన్ని గొలుపు తున్నాయి. యింతటితో శెలవుపుచ్చుకుంటున్నాను. సకలైశ్వర్య సమృద్ధితో నుందురు గాక! పెద్దలకు నమస్కారాలు. సోదర సోదరీమణులకు నా హృదయ పూర్వకాభివందనాలు.

ఇంతే సంగతులు

చిత్తగించవలెను,

మీ విద్యార్థి.



పొగాకు కంపెనీల గుట్టు

ఇంటర్ నేషనల్ ఇయర్ బుక్ ఆఫ్ అగ్రికల్చరల్ స్టాటిస్టిక్సును ఆధారముగా తీసుకొని తయారుచేసిన ఇంపీరియల్ ఎకనామిక్ కమిటి పొగాకు రిపోర్టు యిట్లు తెలుపుచున్నది.

బ్రిటిష్ సామ్రాజ్యము
1935_36

దేశము పేరు	వుత్పత్తి లక్షల పౌ॥	ప్రపంచ వుత్పత్తి లోనూటికి వంతు
హిందూదేశము	15430	24. 1
కెనడా	550	0. 9
రొడేసియా	220	0. 3
దక్షిణ ఆఫ్రికా	180	0. 3
సిలోను	130	0. 2
న్యూజీలాండు	10	0. 2
ఆస్ట్రేలియా	10	0. 2
తదితర దేశములు :		
చైనా	13930	21.8
అమెరికా	12970	20.3
రష్యా	3810	5.9
జపాన్	1490	2.3
ఇటలీ	1020	1.6
ఫ్రాన్సు	840	1.3
జర్మని	770	1.2

1935—36 సంవత్సరములో ప్రపంచ మందలి పొగాకు వుత్పత్తి 6393,00,00,000 పౌనులు. అందులో హిందూదేశమునుంచి 154300,00,000 పౌనులు. అనగా మొత్తపు వుత్పత్తిలో మన దేశపు పొగాకు నూటికి 24.1 వ వంతు.

ఈ పై పట్టీనిబట్టి ప్రపంచమందలి పొగాకు వుత్పత్తి దేశాలలో హిందూదేశము ప్రధమస్థానము వహించియున్నది. ఈ దేశములోకూడ దక్షిణ భాగమే దాదాపు యావత్తు పొగాకును పండించుచున్నది. తిరుచునాపల్లి పొగాకు సిగరెట్లకు పనికిరాకపోవటాన బైట దేశాలకు పంపబడదు. అది మన దేశములో చుట్టల రూపమున ఖర్చగుచున్నది. మైసూరులో పొగాకు పంట యింకను ప్రారంభదశలోనే వున్నది. హిందూదేశమునుండి లండను, రాటర్‌డాం, టోకియో మొదలగు పట్టణములకు పోవు సిగరెట్ల పొగాకు (వర్జనియాఫ్లుక్యూర్) అంతయును గుంటూరు జిల్లానుండియే పోవుచున్నది. 1920వ సంవత్సరములో వర్జనియా పుగాకు పండబడి మన జిల్లాలో మొదలైనది. 1928 వ సంవత్సరములో ఒక వేరను అయినను లేదు. 1936 సం॥లో రెండువేల వేరనులు,పదమూడు అరవెట్టు మరలు యేర్పర్పబడి నవి. దీనిని బట్టి చూచిన యీ జిల్లాలో వరి, పొగాకు యీ రెండే పంటలు నిలుచునట్లు కనబడుచున్నది.

ఈ పొగాకుపంట ఎవరిని బాగుచేయుచున్నదో విచారించవలసి వున్నది. ఇంగ్లాండులో లెండాన్ కంపెనీవారి ఆదాయపు పట్టీ ప్రకారము 1937 వ సంవత్సరములో వారికి దాదాపు 1,78,00,000 రూపాయలు నికర ఆదాయము వచ్చి వున్నది. ఈ కంపెనీకే యింత లాభము వచ్చివున్న బ్రిటీషు సామ్రాజ్యములోకెల్ల గొప్పదయిన ఇంపీరియల్ కంపెనీవారికి ఎంత లాభము వచ్చివుండునో వూహింపవలెను. అట్లే మన దేశములోని నేషనల్ టొబాకో మొదలగు కంపెనీలు ఆర్జించుచున్నవి. గుంటూరునందలి తెలుగు వర్తకుల కంపెనీలలో పెద్దదైన మాజేటివారి కంపెనీ సంవత్సరమునకు షుమారు 50 వేల రూపాయల ఆదాయపు పన్ను కట్టుచున్నారు. దీనిని బట్టి వారి నికర ఆదాయము యెంతయో తెలియ నగును. ఇవన్నియు చూచియే కొన్ని లక్షల పెట్టుబడితో ఈ సంవత్సరమే బ్రిటిషు ఇండియా టొబాకో కంపెనివారు యిచ్చట ఫ్యాక్టరీని పెట్టినసంగతి అందరికి తెలిసియే వున్నది.

వీరందరు యింతంత లాభముల నార్జించుటకు కారణభూతు లెవరు? వీరు యెవరిశక్తి సామర్థ్యముల ఆహుతి చేసుకొని యింత బలవంతు లగుచున్నారు? దీనికి జవాబు నిస్సందేహముగ రైతులు, కూలివాండ్లని చెప్పవచ్చును. రైతు తన తిండికి గొడ్డుమేతకు పనికివచ్చు పంటలను మాని అప్పుచేసి పుగాకును కష్టించి పండించుచున్నాడు. దానిని అట్టివేరనులలో ఎండపెట్టి అమ్మకమునకు పెట్టగా పొగాకువర్తకుడు ఒక కిటుకుచే అతి చౌకగా రైతువద్దనుండిదానిని కొనగలుగుచున్నాడు. ప్రతివర్తకుడును తాను కొనవలసిన సరుకునకు సగటున యెంత ఖరీదు పెట్టవలయునో నిర్ణయించుకునే వుంటాడు. మేలురకపు ఆకుకు ఒక రు 20–0–0 అధికముగ పెట్టినట్టు కనబడి మిగతాసరుకును చాల స్వల్ప ధరకు తీసుకుంటాడు. ఈ విధముగా వాని సగటును (ఏవరేజి) సరిపెడతాడు. ఈ పన్నాగము రైతుకు తెలియక మోసపోతాడు. అతడి నికర ఆదాయము యెప్పుడు ఒకటిగానే వుంటుంది. వచ్చినది ఖర్చుకు చాలదు. అప్పు అప్పుగా వుంటుంది.

ప్రస్తుతము పొగాకు కంపెనీలలో పనిచేసే కూలీలకు యిచ్చే కూలి రోజు ఒకటికి రు 0–4–0 లు. ఒక్కొక్క కూలీ రోజుకు దాదాపు పదిగంటలు పని చేయవలసివున్నది. జ్వరము వచ్చినా కానుపువచ్చినా, మరి యేయిబ్బంది వచ్చినా సెలవులేదు. నాగాలు కట్టుకొనకతప్పదు. ఒక్కొక్కప్పుడు ఆశపడి రాత్రింతయు సహితము తిండి అయినను సరిగాతినక, నిద్రలేకుండ విష వాయువులను పీల్చుచూ కూలీలు అందులో ముఖ్యముగ స్త్రీలు, పిల్లలు తమ శరీరములను గుల్లచేసుకొనుచున్నారు. ప్రొద్దుటింతల వేళ అయినదని పొయిగూడు నుంచి ఒక చేతిలో అన్నపుముద్ద పట్టుకొని, యింటివద్ద విడిచిన చంటిపిల్లను గురించి తలపోయుచు, డొక్కలో నొప్పిపుట్టునట్లు పరుగెత్తుచూ పోవుచున్న ఆడకూలీలనందరు చూచుచునే వున్నారు. చీరాల ఐ.యల్.టి.డి.మేనేజరుకు రోజుకు నూరురూపాయిలకు పైగా జీతమునిచ్చుచున్నాడు. సర్వము ధారపోయు పేద కూలికి రోజుకు రు 0–4–0. అదియు సంవత్సరములో మూడు నెలలకు మాత్రమే. పుగాకు వ్యాపారస్తుడు లాభాలను, వారియొక్క మోటారు కారులను, వుద్యానవనాలను మూడంతస్తుల మేడలను సంపాదించునది నిజముగా చూచిన (1) నోరులేని పశువులు (2) తిండికిలేని రైతులు (3) యేమియులేని కూలీలు.

పొగాకు రైతులు, కూలీలు బాగుపడవలెనన్నను, బలవంతులు కావలెనన్నను, తమ హక్కులను సంపాదించవలెనన్నను ఒక్కటేమార్గము కలదు. అది వారదంరు. సంఘములుగా యేర్పడుటయే. అట్టి సంఘములు యెంత త్వరలో యేర్పడిన అంత త్వరలో వారికి లాభము చేకూర లేదు.

గుంటూరు. 17–2–38 } ఇట్లు గుంటూరు పట్టణ యువజన సంఘము.

చీరాలలో రిజర్వుదళం దేనికి?

చేసిన నేరం కప్పిపుచ్చుకొనేందుకు తంతు

★ చీరాల కాల్పుల విచారణ ★

కామ్రేడ్ పి. లోకనాథం.

చీరాలలో పోలీసులు చేసిన దురంతాలకు ఫలితంగా దేశంఅంతా అట్టుడికి నట్టుడికి పోయింది. దేశంఅంతా కార్మికులపట్ల సానుభూతి, పోలీసులచర్యపట్ల నిరసన బయలుదేరింది. దేశంలోని వివిధ సంఘాలవారు ఈవిషయంలో సరియైన బహిరంగ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చీరాల కార్మికులు కూడా అదేవిధంగా కోరారు. యెప్పుడైతే బహిరంగ విచారణ కోసం ఆందోళన ఆరంభమైందో అది కాయల గుండెలో రాయపడ్డది. తాము చేసినపని యేలాగా సమర్థించుకోటం, తప్పిపుచ్చుకోటం అని ఆలోచించసాగారు. అందుకు మొదటియెత్తు ఒక ముప్పది మంది రిజర్వు పోలీసు దళాన్ని చీరాలలోనే వుంచాలనుకొన్నారు. పొగాకు కంపెనీ గేటుముందరనే ఒక పందిరి వేసి తుపాకులు లాఠీలు, సున్నీలు మొదలైన ఆయుధాలు పందిరికి వ్రేళ్లాడగట్టి రిజర్వు పోలీసంతా అక్కడలే వుంచి ప్రదర్శనం చేస్తూవుంటారు. కొన్ని సమయాల్లో లారీమీద ఎక్కి వూళ్లోతిరిగి వస్తూవుంటారు. ఈ విధంగా చెయ్యటంలో రెండుయెత్తులు వున్నవి. 1 కూలీలు ఇంకా వుద్రేకంగా వున్నారు. మళ్ళా యేం సమ్మె వస్తుందో మరేంవస్తుందో లేక ప్రజాశాంతికి భంగంవస్తుందో (ఇది మామూలు మాటేలెండి) అని రిజర్వు పోలీసును ఇక్కడనే వుంచాం అనటానికి. 2 బహిరంగ విచారణ వచ్చినప్పుడు కూలీలు సాక్ష్యం యూనియన్ తరపున చెప్పకుండా భయపెట్టటానికి. కాల్పులు జరిగిన తరువాత జిల్లా కలెక్టరుగారు వచ్చి ఒక రకమైన రాజీ యేర్పాటు చేశారు. ఆవిధంగా కూలీలంతా పనిలోకి పోతున్నారు. రాజీప్రకారం అందర్ని పనిలోకి తీసికొంటామని కంపెనీ అధికారులు చెప్పినప్పటికి 25 మంది కూలీలను పనిలోకి తీసికోనేలేదు. మిగతా కూలీలంతా శాంతంగా పనిలోకి పోతూనే వున్నారు. కంపెనీలో గాని, దారిలో గాని, వూళ్ళోగాని యెట్టిగలాటాలు జరగకుండా, అంతే శాంతంగా వున్నది మరల సమ్మె చెయ్యాలనే వుద్దేశం యూనియన్ వారికి లేనేలేదు. అటువంటి పరిస్థితులలో అధిక వ్యయంతో రిజర్వు పోలీసును చీరాలలో వుంచటంలో అర్థం యేమిటి? కూలీలను భయపెట్టే వుద్దేశ్యం లేకపోతే మరేమైనా వున్నదా. ఈవిధంగా అనవసరంగా రిజర్వు పోలీసులను వూళ్లో వుంచటంవల్ల గ్రామస్థులకు కూలీలకు చాల అవమానకరంగా వుంది. "మేము శాంతంగా పనిలోకి పోతుంటే యేమేమో శాంతానికి భంగం కలిగిస్తున్నట్లుగా ప్రభుత్వానికి, ప్రజలకు తోచటానికే ఈవిధంగా చేస్తున్నారా"అని కూలీలు అనుమానిస్తున్నారు. నిజం చెప్పాలసొస్తే ప్రశాంతంగా పనిలోకి పోతున్న కూలీలకు యెదురుగా ఈలాంటి సైనిక ప్రదర్శనం వుంచటంవల్ల శాంతంగా వున్న కూలీలలో క్రోధం తెప్పిస్తూ వీళ్ళే ప్రజా శాంతికి భంగం తెప్పిస్తున్నారంటే తప్పేమున్నది?

రూథర్‌ఫర్డు నియామకం.

ఈలాంటి పరిస్థితులలో విచారణ జరపటానికి రూథర్‌ఫర్డుగారిని నియమించారనే పిడుగులాంటి వార్త పత్రికలలో పడ్డది. ఇదివరకు 1921 లో గుంటూరు జిల్లా కలెక్టరుగా వుండి పన్నుల నిరాకరణోద్యమ సమయంలో గుంటూరుజిల్లాలోని ప్రజలమీద అందులోని పన్నుల నిరాకరణలో అగ్రస్థానం వహించిన పెదనందిపాడు ఫిర్కా ప్రజలమీద చేసిన దుండగాలు చవి చూచిన గుంటూరు జిల్లా ప్రజలకు రూథర్‌ఫర్డు నియామకం మాట వినగానే అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది. వెంటనే మారు మూలల నుంచి కూడా అసమ్మతి సభలు బయలుదేరాయి. దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు దీన్ని తీవ్రంగా యెదుర్కొని రూథర్‌ఫర్డునే నియమించినట్లయితే విచారణను బహిష్కరిస్తామని కూడా ఖచితంగా చెప్పారు. అప్పుడు రాజాజీ రూథర్‌ఫర్డును తొలగించి, మద్రాసు హైకోర్టు జడ్జి హార్వేలుగారిని విచారణకర్తగా నియమించారు.

అధికారులలో ఆందోళన కూలీల అరెస్టులు.

రూథర్‌ఫర్డు విచారణ చేయటం ఆపివేశా రనగానే అధికార్లలోసంచలనం కలిగింది. తమ వాదన నెగ్గదేమోనని భయం వేసింది. ఇదివరకు వేసిన యెత్తులు చాలక కొత్త యెత్తులు యెత్తాలను కొన్నారు. జట్లు జట్లుగా కూలీలను అరెష్టుచేసి బాపట్ల సబ్‌జైలుతో వేశారు. కాల్పులు

(మిగతా 10 వ పేజీలో)

కారల్ మార్క్స జీవిత గాధ

(5వ పేజీ తరువాయి)

మడం వలన మళ్లా ఫ్రాంసే వెళ్లాడు. కాని అచటి ప్రభుత్వంకూడ దేశం నుండి తరిమివేసింది. అక్కడనుండి లండన్ చేరాడు. యావజ్జీవితం అక్కడే జరిపాడు.

★

లండనులో మార్క్సు జీవితం సుఖంగా గడపలేదు. దరిద్రంతో బాధపడే వాడు. అతన్ని దరిద్రం ఎంతవరకు పీడించిదో ఈ ఒక్క కథే చెపుతుంది. 1851 లో సామ్యవాదులపైన కొన్ని కేసులు 'కోలన్'లో పెట్టారు. ఆకేసుకు సంబంధించిన ఏదో పనికి కాగితాలు లేక కోటు తాకట్టు పెట్టవలసి వచ్చింది. మరొకసారి మార్క్సు భార్య అప్పుడే జనించిన శిశువుతోసహా ఇంతఅద్దె ఇవ్వలేనందున బయటకు నడవ వలసి వచ్చింది. 1851 లో న్యూయార్కు ట్రిబ్యూన్‌కు వ్యాసకర్తగా కుదిరాడు. దానివలన వారానికి ఒకపౌండు ఇచ్చేవారు. లండన్ నగరంలో ఇంత తక్కువ ఆదాయంతో జీవితం గడవటం కష్టం. ఈ దరిద్రంతోడు గంపెడు సంతానం. అయినా మార్క్సు నిరుత్సాహ పడలేదు. బ్రిటిష్ మ్యూజియంలో రోజుకు 16 గంటలు గడిపేవాడు, పుస్తకాలు చదువుతూ. జోనా ఎన్నికష్టాలయినా సహించింది. భర్త కష్టాలలో పాల్గొనేది. 1862 నాటికి మార్క్సు అవస్థ మరీ దుర్భరమైంది. చివరకు ఒక రైల్వే గుమాస్తాపనికి అర్జీ పెట్టాడు. కాని "దస్తూరీ బాగుండలేదని" ఉద్యోగం ఈయ నిరాకరించారు. చరిత్రలో రక్తాక్షరాలతో వ్రాయబడు ఒక మహాపురుషుని దస్తూరి బాగుండలేదు! ఉద్యోగము లభింపలేదు!! ఇదీ పెట్టుబడిదారీ సమాజ ప్రభావం!!!

ఈ ఆపత్సమయంలో మార్క్సుకు ప్రాణస్నేహితుడయిన ఎంజెల్సు సహాయం చేయకపోతే ఆర్థికశాస్త్రంపైన వ్రాసిన 'కేపిటల్' అనే గ్రంధం పూర్తి అయి ఉండేదిగాదు. మార్క్సు ఎంజెల్సుల ఉత్తర ప్రత్యుత్తరాలవలన మార్క్సు జీవితమెంత దుర్భరంగాగడిచేదో తెలుస్తుంది.

★

లండన్‌లో నున్నపుడు అచటి కార్మికుల స్థితిగతులకూడా పరిశీలించసాగాడు. 1860 ప్రాంతాల వారి సమస్యలలో పాల్గొన సాగాడు. 1855—65 సంవత్సరాలమధ్య ప్రజాస్వామ్య పద్ధతులకై యూరలోపు తిరుగుబాట్లు లేచినయి. అప్పటికి లండనులోకూడ కార్మికులకు రాజకీయ పార్టీ లేదు. ఇలాంటి పరిస్థితులలో 1864 సెప్టెంబర్ 28 వ తేదీన మొదటి 'కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ స్థాపించారు. మార్క్సు దీనికి మూలపురుషుడు. 1865—71 సంవత్సరాలమధ్య దీనికోసరమే అతడెంతో కృషి చేశాడు.

ఎంతో అవస్థలు పడుతున్నా మార్క్సు గ్రంధరచన మానలేదు. 1850 లో అర్థశాస్త్రంపైన ఒకగ్రంధం వ్రాశాడు. 1867 లో దానినుండే 'కేపిటల్ ప్రథమభాగం వెలువడింది. సోషలిజం ఒక శాస్త్రీయ సిద్ధాంతమనే అతని వాదనకు శత్రువులుకూడా తలవంచేవారు.

★

మార్క్సు అంతిమకాలంలో మరీ బాధపడ్డాడు. "కేపిటల్" ను పూర్తిచేయడానికి రాత్రింబవళ్ళు కృషిచేశాడు. కాని పూర్తిచేయలేక పోయాడు. ఒకసారి మిత్రునికి ఉత్తరం వ్రాస్తూ "దేనికోసం సుఖం, ఆరోగ్యం, పరివారం బలిచేశానో అది పూర్తిగాకుండానే పోతున్నది" కొన్నిరోజులు జబ్బుపడ్డాడు. కాని రష్యావిషయాలు పరిశీలించ మొదలుపెట్టాడు. మార్క్సు అనేక రోగములచేత బాధితుడైయుండగానే, జీవితంలో ఎంతో సహాయ పడిన భార్య జోనా 1882 డిశెంబరు 2 వ తేదీన మరణించింది. 1883 లో అతని పెద్దకుమార్తెకూడ అసువుల వీడింది. మార్క్సు భార్య చనిపోయినపుడు ఎంజెల్సు నిస్పృహతో "ఇంకేముంది-మార్క్సుకూడా మరణించాడు." అని అన్నాడు. అలాగే ఎంతో కాలం బ్రదకలేదు మార్క్సు. 1883 మార్చి 14వ తేదీన నెత్తురు గ్రక్కి మరణించాడు. 55 ఏండ్లక్రిందటచనిపోయిన మార్క్సునుమొన్న 14వ తేదీన ప్రపంచ కార్మికులంతా స్మరించారు. అతని "ప్రపంచ కార్మికులారా ఏకముగండి" అన్న నినాదాన్ని ఎలుగెత్తి ఉచ్చరించారు. అతడుకోరిన 'విప్లవం' వర్ధిల్లుగాక అంటూ నినాదాన్ని పల్కి తమ సంకెళ్ళ విడగొట్టుకోడాని పోరాడ నిశ్చయించారు.

తూ. గో. జిల్లా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ

ది 21 మార్చి 38 సోమవారం రాత్రి 8 గం॥ లకు రాజమండ్రిలో పార్టీ ఆఫీసునందు జిల్లా కార్య సంఘ సమావేశము జరుగును, గాపున ఇదే నోటీసుగా భావించి సభ్యులెల్లరు తప్పక విచ్చేయవలయును.

మందిరి మల్లికార్జున రావు
13-3-38 కార్యదర్శి.

పెద్దాపురం సిల్కు చేనేత పనివారల సమ్మె

ఆరుమాసములవరకు సమ్మె సాగింతురు

పెద్దాపురం శిల్కుసమ్మెకు కారణములు

(1) పెద్దాపురమందు 1913 సం॥ రంలో యీసిల్కుపరిశ్రమ ప్రారంభమైయుండెను. 1920 సం॥రం నాటికి క్రమ క్రమమాభి వృద్ధిచెంది పలువురు వ్యాపారస్తులు, యీ వ్యాపారమునందు, ప్రవేశించి యుండిరి. ఆసంవత్సరమే ముప్పనవారు ప్రభుత్వము వారువద్ద స్టేటు యిండస్ట్రియల్ ఆక్టుక్రింద, యాభై వేల రూపాయిలు దీర్ఘవాయిదా మేరకు, ఋణముతీసుకుని ప్రభుత్వమువారి ఋణము తీర్చులోపల, సమస్తమైన దర్జాఖర్చులుపోను, పదిలక్షలు నికరాదాయమును సంపాదించి యుండిరి. మిగతావర్తకులు. కూడా తగురీతిని, మంచిలాభమును పొంది ధనవంతుల పార్టీలలో చేరియున్నారు

లాభములు

(2) యీపరిశ్రమ ప్రారంభమైన తర్వాత, చాలా సంవత్సరములవరకు వకతులం తూకంగల శిల్కుబట్ట తయారుచేయించి విక్రయించగలిగితే యెన్మిది అణాలకు తక్కువలేని లాభము వచ్చుచుండెను. అనగా పౌను బట్టకు, నేయించినయడల, దళారీవార్కి. రు 20-0-0లు లాభము చేకూరుచుండెను. మొన్న మొన్నటివరకు. పౌను బట్టకు రు 10-0-0 లకు తక్కువ లేకుండా యీదళారీలు పొందుచుండిరి. యీ లాభములుగాక గ్రామాదులందు విక్రయించు అంగళ్ళవారు తమ లాభమును వేశి, విక్రయించుచుందురు. కొన్ని సంవత్సరములక్రిందటనుండి పౌనుకు అయిదు రూపాయిలున్ను, యీనాడు పౌనుకు రెండురూపాయిలకు తక్కువ లేకుండా మూడు రూపాయిలవరకు, లాభము వచ్చుచుండెను. ప్రథమ సంవత్సరమున, గ 36 లు శిల్కు పదునుపేకలు ఆరు పౌనులు తూకం వుండెను. తర్వాత అయిదు పౌన్లు, యీనాడు నాల్గు పౌన్లు, తూకం తూగుచున్నది. వక మగ్గమునకు సగటున వక పడుగు తయారగుచుండును. ఆలాంటివి యీ శిల్కు నేయు మగ్గములు 1100 లు గలవు. యిందులో సుమారు సగభాగము ముప్పనవారివే. యిప్పటికి యిరవై సంవత్సరముల నుండి వందల కొలది మగ్గములు వ్యాపారము జరుగుచున్నది. వక్కొక్క మగ్గముమీద వ్యాపారస్తులకు ఆదిలో రు 500—0—0 లు సం॥రం నాటికి లాభం వచ్చుచుండెదిది. తర్వాత వెయ్యి రూపాయిలున్ను అటుపైని 500-0—0 రూపాయిలున్ను యీనాడు నూరు మొదలు, నూటయాభై రూపాయిలవరకు ఆదాయము వచ్చుచున్నది.

మజూరీలు

(3) యీ శిల్కుపరిశ్రమ ప్రారంభకాలమందు ఆరు పౌనుల తూకముగల శిల్కుపడుగు పేకలకు, గ 36 లకు రు 32—0—0 మజూరీల నిచ్చియుండిరి. అది క్రమ క్రమముగా యీనాటికి రు 16—0—0 మిల్లులగల వర్తకులున్ను, రు 14—0—0 లు చిల్లర వర్తకులున్ను, యిచ్చుచున్నారు. ప్రథమమున నెల 1 కి రు 32—0—0 లు సంపాదించిన ఆసామీ యీనాడు రు 16—0—0 లు 14—0—0 లున్ను సంపాదించుచున్నాడు.

సమ్మెలు

(4) యిరవై అయిదు సంవత్సరముల క్రిందట పట్టుబట్టలకుగల ఖరీదునకన్న, యీనాడుగల ఖరీదుచాల తక్కువగా నున్నది. యిందులకు బాధ్యులు వర్తకులే, వకరికన్న వకరు. ఎక్కువ వ్యాపారములు సాగించి, లక్షలకొలది గడింపవలెనను, ఆశతో ధరలు తగ్గించి తమ వ్యాపారములను. పెంపుచేసు కొనుచుండిరి. వీరి వీరి పోటీలకు, వస్త్రనిర్మాతను బలిగా గొనుచున్నారు. కూలీలు తగ్గుకొలది చేనేతపని వారిలో అసూయత ప్రారంభమై, 1922 సం॥ లో ప్రథమ సమ్మె జరుపబడెను. అనంతరము 1927 సం॥ లోను అటుపైని 1931 సం॥ లోను, తర్వాత 1936 సం॥ లోను జరిగియున్నది. 1937 సం॥ రం॥ లో వక్కపుప్పాడ గ్రామమునందు మాత్రిము జర్గినది. యీనాటి సమ్మెకు కారణము పడుగు 1కి రెండు రూపాయలు కూలి తగ్గించుటయే యిందువలన సం॥ రం॥ 1కి. 1100 లమగ్గములకు సుమారు యిరవై అయిదు వేల రూపాయిలు నష్టము చేకూరుచున్నది. యిందులకుగాను, 32 గ్రామాదులవారు 1100 లు మగ్గములు, నాలుగువేల పనివార లేకమై. జనవరి 22 తేదీనుండి యీసమ్మె ప్రారంభించి, యుండిరి. ప్రథమమున అయిదు సమ్మెలకు ప్రత్యేక సమ్మె సంబంధమైన సంఘములు లేనందున్ను వర్తకులు జయము పొందుచూ వచ్చియుండిరి. ప్రతిసమ్మెకు రెండు రూపాయిలకు తక్కువగాకుండగా మజూరీలు తగ్గింపబడుచునే యుండెను.

యీనాడు ముఖ్యమైన గ్రామములందు, గ్రామ సంఘములుంచి 14 గురుగల, ప్రధానసమ్మె కార్యనిర్వాహక సంఘ మేర్పడి, చక్కని ఆదర్శనములతో సమ్మెను సాగించుచున్నారు

వర్తకుల నిరంకుశములు

(5) చిల్లర వర్తకులు వస్త్రనిర్మాతలకు చేయు అన్యాయములు చెప్పవగినంత గట్టిగా కనుపించుటలేదు. పెద్ద వర్తకులు అనగా పెద్దాపురములోమిల్లుల యజమానులు అందులో ముప్పన వారు గావించుచున్న ఆన్యాయములకు మేరయే లేదు. ఎందుకనగా అంచులో వున్న జరీపేటులో వకపువ్వు తప్పితే అయిదు రూపాయిలవరకు జరిమానా, జరీకమ్మ బాగులేదని రెండురూపాయిలు జరీమానా, నేత మధ్యలో మడతకన్ను కనుపించితే అదివక తప్పు, నేత బాసుగా లేదని వకతప్పు. యింకా మున్నగు తప్పులు చెప్పక తీరని యీ విపరీతమగు జరిమానాలున్ను. యింకా శిల్కుపడుగులు వారి యంత్రములమీద తయారు చేయించి కొంచెము పదును వుండగానే పనివారలకు యిచ్చెదరు. యీ పదునుగల శిల్కునేశి తెచ్చిన తర్వాత 10 తులములు మొదలు 20 తులాలు వరకు తడివలన, తూకము తగ్గును. యీ తక్కువ తూకముగల శిల్కు, తులం 1కి నాల్గు అణాలుకు తక్కువ లేకుండా నేశినపనివాడే భరింపవలెను సరిగదా పడుగు దిగవేశి తీసుకవెళ్ళి యిచ్చినతర్వాత జమ్మివ్రాసుకునేటప్పటికి రెండుమూడు దినములు. పడుగు యిచ్చేటప్పట్కి మరిరెండు రోజులు- కూలి యిచ్చేటప్పటికి వారంపది దినములు యీ విధముగా కాలము పట్టుచుండును. పడుగు దిగిన తర్వాత అయిదారు రోజులు పనిలేక పూరకున్న కారణమున యిచ్చిన పడుగు తడిది. పొడిది అనే విషయ మాలోచింపక పడుగు దొరికినదే చాలని యీ అమాయకుడు తీసుకువెళ్లుట తప్పుటలేదు. అలా లేనిచో మరినాల్గుదినములు పని లేక యుండవలెని యున్నది. వక్కొక్కప్పుడు తడిపడుగులు ఏకారణము చేతనైనా రంగువేయుటలో ఎక్కువ పుడకబెట్టుటచేతనో, కొన్నిదినములు నేయడం ఆలస్యమైనచో, నిల్వవున్నయడల శిల్కు చిట్లిపోవు చుండెను. ఆచిట్లిపోయిన పడుగు నేయుటకు రాక, 15, 20, దినములు నేసిన మూ 10 వవంతూ కూడా నేతజరుగక పడుగులుతెచ్చి యియ్యనపుడు అంతవరకు కోశివేయవలశినదని చెప్పి ఆపడుగున కయ్యే ఖరీదు లాభముతో సహా యీపని వాని మీద ఖర్చు వ్రాశి వసూలు చేయుచున్నారు. యింకను, పడుగులలోను పేకలలోను వక్కొక్కరకం నాలుగు తులములకు తక్కువ మిగిలితే ఆమిగిలిన శిల్కునేతపనివాడే భరింపవలశివున్నది. ఆమిగిలిన శిల్కు తులమునకు అణాఎక్కువ లాభముతో ఖర్చు వ్రాయబడునుపడుగులో మూడుతులములు పేకలో మూడుతులములు మిగిలినయడల ఆరు తులములకు ఖరీదు. రు 1-8-0 లు షాహుకారు పని వానిమీద ఖర్చు వ్రాశి వసూలు చేయుచుండును. ఆమిగిలిన పట్టువస్త్ర నిర్మాత. జడబొందులకో నోము దారములల్లు వారికో తులం 1కి మూడు పైసలు చొ॥ విక్రయించుకోవలశియున్నది. ఎక్కువ శిల్కు గనుక మిగిలినయడల, తులమునకు ఒక అణా తక్కువ ఖరీదునకు జమ వ్రాస్కుని పుచ్చుకును చుందురు. యిదియునుంగాక వర్తకుని కొట్టువద్దగల సేవకులకు జీతములు నేతపనివారలిచ్చు కొనవలెను. వసూలుచేసిన సొమ్ములో సగభాగం ఖర్చుపెట్టి మిగతా సగభాగము జమ వ్రాసుకోవడము. యింకా పనివాడు నేసిన శిల్కుపడుగు 1కి నాలుగు అణాలు తక్కువ గాకుండగా, ధర్మ వసూళ్లు చేస్తుంటారు. యీ ధర్మము (లేదా దేవుడు) వసూళ్లు వక ముప్పన వారివద్ద. సుమారు రు 25000. రూపాయలు నిల్వవున్నవి. వీరుచేయుట పార్టీలకు డిన్నరుపార్టీలకు దాన ధర్మములకు నేత పనివారిపై చందాలు. 1930 సం॥ 1936 సం॥ లోను, కొన్ని గృహములు దహనముకాగా అందులకుగాను నేత పనివారివద్ద వసూలుచేశి వర్తకులే దానముచేశారు. యీ వసూళ్ల పనివారలు వప్పుకోమన్నను, ఎదురు జాబితా బుక్కులో ఖర్చు వ్రాయటమే తర్వాత వారిచిట్టాను ఖర్చు వ్రాయడం యీ కాలమునకు మా వర్తకులకు ఎదురులేదు. యీ వర్తకుల ఎదుట నేతపని వారల జీవితము చాలా నీచపుబ్రతుకుగా నెంచబడుచున్నది. తమకు గలింగిన సంపదయున్ను. తాముచేర్చిన లక్షలకొలది ధనమున్ను యీవస్త్ర నిర్మాతలవల్లనే గలిగినది. వీరిలో ఏకోశమునందును, దయ కాగడాలువేసి చూచినను, ముప్పనకైనా కానవచ్చుట లేదు.

ఆశయములు

(6) యీ అమాయకులగు చేనేత పనివారల ఆశయములు చాలా ఆనందమును గల్గుచేయుచున్నవి. నిరంకుశమగు ప్రవర్తనలన్నియు, వర్తకులు మానివేశి సమ్మె సంఘమువారి అనుమతి

(మిగతా 14 వ పేజీలో)

పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెస్ ఎన్నికలు

ఎన్నికోద్యోగి గారిపై ఆక్షేపణలు

పశ్చిమ గోదావరిజిల్లా కాంగ్రెసు కమిటి ఎన్నికలలో చాల చిత్రములు జరుగుచున్నవి. రాష్ట్రీ కాంగ్రెసు వర్కింగు కమిటి సభ్యులను ఆయా జిల్లాలకు ఎన్నికోద్యోగులుగా నియమించి, పశ్చిమ గోదావరి జిల్లాకు శ్రీ కొమ్మారెడ్డి పెదఅంజనేయులుగారిని ఎన్నికోద్యోగిగా నియమించిరి. వీరు జిల్లామొత్తముమీద ఎన్నికలను జరుపవలెను. అందుకై వేర్వేరు తాలూకాలందు బాధ్యతగల సమర్థులగునట్టి వారిని ఎన్నికోద్యోగులుగా నియమించి పని చేయువలసియున్నది. ఆ విధముగు నిర్ణయము చేయునపుడు ఆ యా తాలూకా కాంగ్రెసు సంఘ అధ్యక్ష కార్యదర్శులలో ఎవరినైననుగాని, లేక ఆ తాలూకాలో నున్న జిల్లా వర్కింగు కమిటి సభ్యులనుగాని, వారుకూడ లేకున్నచో, ఆ తాలూకానుండి రాష్ట్రీ కాంగ్రెసు కమిటీకి సభ్యులుగా ఎన్నుకొనబడి నట్టివారిని నియమించుట ధర్మము. న్యాయము— కాని భీమవరం తాలూకాలో ఎన్నికోద్యోగిని నియమించుటలో శ్రీ అంజనేయులుగారు ఈ దృక్పథమునే పూర్తిగా విడిచి పైచి శ్రీ గోకరాజు శ్రీరామరాజుగారు అను ఆయనను ఎన్నికోద్యోగిగా నియమించిరి. వీరు తాలూకా కాంగ్రెసు సంఘము నందు సామాన్య సభ్యులు మాత్రమే. తాలూకాకాంగ్రెసు వర్కింగు కమిటిమందుగూడ సభ్యులు గారు. జిల్లా వర్కింగు కమిటీయందును సభ్యులు కారు. అవీగాక, ఈ సంవత్సరము పి.సి. సి కి సభ్యుడును గాదు. ఈస్థితిలో వీరిని ఎన్నికోద్యోగిగా నియమించుటలో అంజనేయులుగారి అభిప్రాయమేమో ఎవరికి గోచర మగుటలేదు.

బహుశా జిల్లా అధ్యక్షస్థానాన్ని వశము చేసుకొనుటకు, జిల్లా ఎన్నికలలో తమ ఇచ్చవచ్చిన విధాన్ని వర్తించి ఏదో పదవీ వ్యామోహ పీడితులై యున్నట్లు యిందుమూలముగా విదిత మగుచున్నది. యిట్టి అక్రమవర్తనల వలన, శ్రీ అంజనేయులుగారు భీమవరం తాలూకా కాంగ్రెసు సంఘాధికారులకు తీరని అవమానమును గూర్చియుండిరి— ఎన్నికలు జరుపుటకుకూడ తగరని నా అభిప్రాయము—న్యాయా న్యాయములను గాని, ధర్మాధర్మములనుగాని విచారించక పదవీవ్యామోహ పీడుతులయొక్క పై చర్య తీవ్రముగా ఖండించుచున్నాను. ఇందలి నిజానిజాలను గమనించి, యీ అక్రమానికి, ప్రాధమిక కాంగ్రెసు సభ్యులే తగు సమాధానము ఈయవలసినదిగా కోరుచున్నాను.

ఇట్లు
వేజెర్ల రామరాజు
మండగంటి గ్రామ కాంగ్రెసు సంఘం
కార్యదర్శి

ఈ జిల్లాలో జిల్లా కాంగ్రెసు కమిటీలకు అభ్యర్థులు పోటీ చేయవలసినవారు దరఖాస్తుఫారములను పూర్తిచేసి రుసుముతో పంపవలయును. అట్టి ఫారములను సప్లయి చేయుటలో కూడ ఎన్నికోద్యోగిగారు చాల అక్రమముగా ప్రవర్తించుచున్నట్లు తోచుచున్నది. భీమవరం తాలూకానుండి జిల్లా కాంగ్రెసు కమిటీకి 17న్నూ తాలూకా కాంగ్రెసు కమిటీకి 69 స్థానములు వున్నవి. ఒక్కొక్క స్థానమునకు ఎంద రెందరు పోటీ చేయుదురో! ఇట్టి పరిస్థితులలో ఎన్ని దరఖాస్తుఫారములు సప్లయి కావాలో సామాన్యుడు కూడ గుర్తించగలడు. యిది గాక ఫారములు కావలసినవారు తాలూకా కాంగ్రెసు కమిటీవద్దకు వచ్చి అడుగుదురే గాని మరి ఎవ్వరివద్దకును పోరు. అట్లు అడుగువారికి సప్లయిచేయు బాధ్యత తాలూకా కాంగ్రెసు కమిటీదే. ఇట్టి స్థితిలో తాలూకా కాంగ్రెసు ఆఫీసుకు 50 ఫారములను మాత్రమే సప్లయి చేసిరి. తాలూకాలోని కొందరి వ్యక్తులకు వ్యక్తిగతముగా 25, 30 ఫారములు యిచ్చియుంచిరి. యిందులోని గూఢార్థము ఏమియో ఎవ్వరైనను వూహించితే తేలుతుంది. బాధ్యతగల తాలూకా కాంగ్రెసు కమిటీని నిర్లక్ష్యముచేయుట దానిని అపనిందపాలుచేయుట మొదటి వుద్దేశమనియు తమకు అభిమానులగువారికి ఎక్కువ ఫారములను సప్లయిచేసి తామే ఈ విధముగా తాము గాని, తమ అభిమానులు గాని, పదవీ అధిష్ఠానమునకు వీలగు సభ్యుల విజయాన్ని చేకూర్చుకొనుటకు, పన్నాగమని విదితము కాగలదు.

మార్చి 7,8 తేదీలలో నామినేషన్‌లు జరుగవలసియుండగా 5 వ తారీఖువరకు నియోజకవర్గాల మార్పులు తెలియజేసి యుండలేదు. భీమవరం తాలూకా ఎన్నికోద్యోగిగా గోకరాజు శ్రీరామరాజుగారిని నియమించిరి. ఈయన కాంగ్రెసులో పావలా సభ్యుడు మాత్రమే. తాలూకాలో తాలూకా కాంగ్రెసు కమిటీ ప్రెశిడెంటు, కార్యదర్శులు, జిల్లా కాంగ్రెసు వర్కింగు కమిటీ మెంబర్లు పి. సి. సి. మెంబర్లు వుండగా తాలూకా ఎన్నికోద్యోగిగా శ్రీ రామరాజుగారిని నియమించుట శోచనీయము. ఈ నాటకాలను భీమవరం తాలూకాలోని ప్రజలున్నూ, జిల్లాలోని ప్రజలున్నూ గుర్తించ ప్రార్థిస్తూ వున్నాను.

ఇందులోనే ఇంత నాటకము ప్రారంభమైతే, యింక ఎన్నిక లెంతఅందముగా జరుగుతాయో అనుమానము గానే యున్నది. ఈ విషయమై కాంగ్రెసులో పావలా చందాదార్లుగా చేరినవారు పూర్తిగా గుర్తించి జాగరూకతతోవుండగలందులకు ప్రార్థిస్తూవున్నాను.

గొట్టుముక్కల వెంకట్రామరాజు
కార్యదర్శి.
తాలూకా కాంగ్రెసు కమిటీ
భీమవరం.

స్మృతి చిత్రము

(4 వ పేజీ తరువాయి)

న్యవాదులనీ-అర్థంలేని ఆవేశపరులనీ-దుడుకు పిల్లకాయలనీ ఏమేమో శబ్దజాలములు విసరుతూ ఈసడించి ఆక్షేపిస్తూ వుంటారు. ప్రస్తుతం సంఘంలోవున్న నీతి ఇదేలెండి.

ఆపిచ్చితనపు మత్తులో దెబ్బల్నితెక్క చెయ్యకుండా సత్యం పోట్లాడుతూనే వున్నాడు. ఆపోట్లాట అందర్నీ గట్టుపైనుంచి పల్లంలో కీడ్చింది. ముష్టియుద్ధం సాగుతూనే వుంది. ఇంతలో ఎదిరిపక్షం వాడొకడు సత్యం జేబులో వున్న పుస్తకాన్ని లాగేడు. అతనితో "ఇకనైనా నీదారినిపో. ప్రవాహంలోనికి పడద్రోస్తాం" అని బెదిరించారు.

సత్యం క్రోధం పెచ్చుపెరిగింది. "ఓడిపోయి వెళతాననేదిక కల్ల. న్యాయాన్ని ఓటమికి విక్రయించి పారిపోవాలనే తీపి ప్రాణంమీద నాకేమీలేదు. మీదగ్గర పండ్లఖరీదు పుచ్చుకునైనా వెళతాను. లేకపోతే ప్రాణాన్నైనా ఒదుల్తాను" అన్నది సత్యం సమాధానం. "చావోజయమో" అన్న దృఢనిశ్చయాన్ని చిత్రించుకున్నాడు తనహృదయ ఫలకం మీద సత్యం.

చివరికి సత్యానికే జయం లభించింది. ఆవంచకులు నల్గురైదుగురున్నా, సత్యం కంటె తక్కువేగాని మొత్తంమీద వాళ్ళకూ దెబ్బలు బాగానే అంటినై. సత్యంలోవున్న ధైర్యమూ ఓర్పు వాళ్ళకెక్కడివి? ఎంతకీ సత్యంవదలక పోవడమూ ఒక పరాయివానికోసం అతనల్లా పోరాడి దెబ్బలుతగిలినా లెక్కచేయక పోవడం చూస్తే వాళ్ళకు ఆశ్చర్యం కలిగింది. సత్యం పిడికిలిపోట్లుకూడా వారి మనస్సులను వెనుకంజ వేయించినై. లాభంలేదని, వెధవడబ్బుకోసం తగాదా ఎందుకని తపతోతాము ముదలకించుకుని ఓటమి కంగీకరించారు. సత్యం పుస్తకాన్ని ఇచ్చివేసి పండ్లవానిబాకీ పారవేసిన జంగెడ ఖరీదుతోకలిపి రూపాయి పావలా సత్యంచేతిలో పెట్టారు. పోతూ పోతూ వాళ్ళతో ఒకడు సత్యం వంకచూచి "నీయంత బలవంతుణ్ణి చాలామందిని చూచాంగాని నీవంటిపట్టుదల—ధైర్యమూగల మనిషిని యివ్వాళనే చూడగలిగాం" అన్నాడు.

సత్యానికి దెబ్బలు బాగానె తగిలాయి. వొళ్ళంతా నొప్పులుగావుంది. అయినా అతని ముఖంమీద విజయోల్లాసం వుట్టిపడుతోంది. ఆసంతోషంలోనే బయల్దేరాడు నడిచేశక్తి లేకపోయినా. దారిలో రోడ్డుప్రక్కగా విచారంతో నిలబడివున్న పండ్లవాణ్ణి చూచాడు. దగ్గరకువెళ్ళి 1—4—0 అతని చేతిలోపెట్టి తనదారి పట్టేడు.

కన్నీరుకారుస్తూ ఆవృద్ధుడు కృతజ్ఞతాసూచకంగా సత్యంవంక చూస్తూ అక్కడే నిలబడివున్నాడు.

పెద్దాపురం సమ్మె

(ప్రక్కపేజీ తరువాయి)

లేకుండా వర్తకులు కూలీలలో ఎట్టిమార్పులు చేయరాదు. వర్తకుల సంపదకు కారకులగు శిల్కుచేనేత పనివారలను సగౌరవముగా చూడవలెను. చూచెదమని చెప్పుటకాక, వారిలో సక్రమ మగు మార్పు గలిగినట్లు, ఆచరణయందు కానరావలెను. అప్పుడు యీ శిల్కుసమ్మె రాజీకి రాగలదు.

అరుమాసములు సమ్మె సాగింపనెంచుట

(7) యిదివరైఅయిదు దినములు సమ్మె సాగినతర్వాత, సమ్మెసంఘము వారు ఫిబ్రవరి 17 తారీఖున దీర్ఘముగా ఆలోచించి సమ్మెను ఆరు మాసముల వరకు సాగించుటకు తీర్మానించి అమలుజర్పి యుండిరి. యిందుకు 32 గ్రామాదులవారు అంగీకరించి యుండిరి. గాని, వీరు సమ్మెకట్టుకుని వుండనా అని వర్తకులు భేదించుటకు చాలా చాలా కుట్రలు పన్నుచున్నారు.

సహాయం కావలెను

(8) కాంగ్రెసు కార్మికకర్షక చేనేత సంఘములవారు, వెంటనే తగురీతిని యీ సమ్మెకు సహాయం చేయవలసి యున్నది. చేనేత సంఘములందు, సమ్మెలకిదే ఆదర్శము. సమ్మె చాలా తీవరూపము దాల్చియున్నది. తూర్పు॥ గోదావరిజిల్లా, రాష్ట్రీ, అసెంబ్లీసభ్యులు, యీ సమ్మెకు వివరములు ప్రభుత్వము వారిదృష్టికి తీసుకురావలెను. చెన్నరాష్ట్రీ కార్మిక మంత్రి గారైన గౌ॥ గిరిగారు వెంటనే శ్రద్ధ వహించవలెనని, కోరుచున్నాము.

27-2-1938 పెద్దాపురం
శిల్కు చేనేత పారిశ్రామిక సంఘం

144 సెక్షను తర్వాత

చీమలపాడు డాక్టరుగారి దౌర్జన్యం.

ఇటీవల చీమలపాడులో రైతులపై ప్రయోగించబడిన 144 వ సెక్షను ఇంకా అమలులోనుండగానే ఆగ్రామ డాక్టరుగారు జమీందారీగ పక్షపాతము వహించి రైతులనెంతో బెదరిస్తున్నారట. ది 5-3-38 వ జగన్నాథం అనే దర్జీ తనకు ఆడాక్టరునుండి రావలసిన కుట్టుకూలిని అడిగినారట. కొంతతగ్గించి యిస్తానన్నాడట. అదైనా కష్టంమీద ఇచ్చాడట. అట్లు తగ్గించినందులకై జగన్నాథం రశీదుకూడా పుచ్చుకొన్నాడట. అకార్పణ్యం వహించి ఆదర్జీ ఒకకోమటి కొట్టులో కూర్చొనియుండగా రోడ్డుమీదికి కీడ్పించి ముగ్గురు జమీందారీ నౌకరులచే దారుణంగా కొట్టించినాడట. రైతులపైకూడా అనేక పితూరులను పోలీసు స్టేషన్లకు రిపోర్టు చేస్తున్నాడట.

ఆంధ్రరాష్ట్రరైతుసంఘం

బెజవాడ

బెంగాలులో జరుగబోవు అఖిలభారత రైతుమహాసభకు ప్రతినిధుల ఎన్నికలను, జిల్లా, తాలూకా, గ్రామరైతుసంఘాల ఎన్నికలను జర్పించుటకు ఆయా జిల్లా రైతుసంఘాధ్యక్షులనే ఎన్నికోద్యోగులుగా నిర్ణయించడమైనది. అవుసరమైనచో అధ్యక్షులు తన అధికారములను ప్రధాన కార్యదర్శికి డెలిగేటు చేయవచ్చును.

ఇట్లు
(సం) కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి
బెజవాడ 6-3-38 } అధ్యక్షులు ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం

తిరువూరుతాలూకా జమీన్‌రైతుల దుస్థితి.

"పశ్చిమగోదావరిజిల్లా చింతలపూడి తాలూకా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటప్పారెడ్డిగారి నాయకత్వముక్రిందను భోప్పు వెంకటరత్నం సంఘ అప్పయ్యగార్లు తే 22-2-1938 దీన ప్రచారము సాగిస్తూ, పోలవరం జనార్ధనవరం, చాట్రాయి, బూరుగుగూడెం సుడిపాడు సనుబండ, పుల్లగేల రేపూడి, మొద్దులపర్వ రెడ్డిగూడెం కొండపర్వ కొత్తగూడెం, వగైరా గ్రామములలో జమీందార్లు మొఖాసాదార్లు రైతులకుపెట్టు బాధలనుగురించిన్ని ఋణబిల్లును గురించిన్ని యెస్టేటుల్యాండాక్టును గురించి; మద్యపానమును గురించిన్ని రైతు కూలీలసంఘమును గురించి ప్రబోధము గావించిరి. కొండపర్వగ్రామ మొఖాసాదారు దుండగములు వీరు చాలవరకు విమర్శించినారు, అచటనున్న ప్రజలు పడుచున్న బాధలు విపరీతములైయున్నవి, యిప్పటి పరిస్థితులు చూచిన మొఖాసా గ్రామములలో పరిపాలన దారుణంగా ఉన్నది, మొఖాసాదార్లు రైతులను అన్యాయముగా, పోంటు కేసులు సమ్మరీలు పెట్టి నానావిధ నిర్బంధములు చేయుచున్నారు. రైతుకూలీలు తిండిలేక అల్లాడుచున్నారు. అగ్నికి గాలి సాయమైనట్లు అప్రాంతదేశమున క్షామము ప్రాప్తించినది కావున రైతుసోదరులెల్లరు మొఖాసాగ్రామ బీదరైతులకు తమకు తోచినకొలది ధనసహాయము జేయుగోరెదను.

భోప్పూడి,
ది, 5-3-38

యిట్లు
కొండపర్వ వెంకటరత్నం,

తూ. గో. జిల్లా

వ్యవసాయకూలీ మహాసభ.

రాజోలుతాలూకా టేకుచెట్టుపాలెంలో జరుగబోయే ప్రథమ తూ. గో. జిల్లా వ్యవసాయకూలీ మహాసభ యిదివరలో ప్రకటించినటుల 27 మార్చి 38 తేదిని కొనికారణములచే జరుప వీలుపడనందున 10 ఏప్రిల్ 38 ఆదివారమునాటికి మార్చడమైనది. కాబట్టి యీ మార్పు వ్యవసాయ కూలీలు వారి శ్రేయోభిలాషులు గమనించి ఆ తేదినాటికి తప్పక విచ్చేసి మహాసభ జయప్రదముగా జరుగుటకై తోడ్పడగోరుచున్నాను.

టేకుచెట్టుపాలెం 9 మార్చి, 38 } గెడ్డం మహాలక్ష్మి ఆహ్వాన సంఘాధ్యక్షుడు.

యువజన మహాసభ.

రాజోలుతాలూకా టేకుచెట్టుపాలెంలో జరుగబోయే ద్వితీయ తూ. గో జిల్లాయువజన మహాసభ యిదివరలో ప్రకటించినటుల 25 మార్చి తేదీని జరుప వీలులేనందున 8 ఏప్రెలు 38 శుక్రవారం నాటికి మార్చడమైనది. కాబట్టి యీ మార్పు గమనించి ఆ తేదీనాటికి తప్పక విచ్చేసి మహాసభ జయప్రదముగా సాగించ ప్రార్థితులు.

టేకుచెట్టుపాలెం 9 మార్చి 38 } అల్లూరి సీతారామరాజు. ఆహ్వాన సంఘాధ్యక్షుడు.

కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ.

జిల్లాలోని కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సభ్యులెల్లరు మార్చి నెలాఖరులోగా సంవత్సర (1938 ఏప్రియల్ 1939 మార్చి 31 వరకు) చందా (సభ్యుని 1కి రు 0-4-0) "జిల్లా పార్టీ ఆఫీసు - రాజమండ్రికి" అందచేయవలయును. అట్లు అందజేయని వారు ఏప్రిల్ 1న తేదీనుండి పార్టీ సభ్యత్వమును కోల్పోయెదరు.

రాజమండ్రి. 5 మార్చి 38 } నండూరి మల్లిఖార్జునరావు కార్యదర్శి.

విజ్ఞానం

సంపాదకులు: కాళీపట్నపు కొండయ్యగారు.

మానవ సంఘంలోని మూఢత్వం, దారిద్ర్యం, దుఃఖం నిర్మూలం చేసి, భూతలం మానవకోటికంతటికి ప్రత్యక్ష స్వర్గంగ చేయగల నవయుగ సంస్థాపనకు ఆధారభూతమైన విజ్ఞానం వ్యాపింపజేసే పత్రిక. అందరికీ అర్థమయ్యే సులభమైన భాషా, వ్రాసిన విషయాలు స్పష్టపరచే బొమ్మలూను.

సంవత్సరానికి 6 సంచికలు-చందా 1 రూపాయలు. పత్రికటనదార్లకు ప్రత్యేక సౌకర్యాలు. వివరాలకు వ్రాయండి.

మేనేజరు, విజ్ఞానం. రాజమండ్రి.

Printed by V. Suryanarayana Sastry at Srinivasa Press and Edited and Published by M. Annapurniah } Rajahmundry.

END OF VOLUME